నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శుక్రవారం డిసెంబర్ 06, 2024 www.navatelangana.com

తక్కువ నీటితో ఎక్కువ లాభాలు సాధించే దిశగా కృషి చేయాలి : డీఆర్‌డీవో



నవతెలంగాణ-కామారెడ్డి

ప్రతి గ్రామంలో మహిళలు తక్కువ పెట్టుబడి తక్కువ నీటితో ఎక్కువ లాభాలు వచ్చే విధంగా చిన్నపాటి పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలని డిఆర్‌డిఓ సురేందర్ సూచించారు. గురువారం నర్సన్న పల్లి గ్రామంలో చిదర శ్రీనివాస్ రెడ్డి ఫిష్ పాండ్‌లో 1500 చేప పిల్లలను వేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథి డిఆర్‌డిఓ సురేందర్ , ఎంపీడీవోలు హాజరై చేపలు వేశారు. అనంతరం ములగ తోట వేయడానికి భూమి పూజ చేశారు. కొటాల్‌పల్లికి చెందిన గోపాల్ వ్యవసాయ భూమిలోని కూరగాయల తోటను సందర్శించారు. కార్యక్రమంలో కామారెడ్డి ఎంపీడీవో నాగ వర్ధన్, ఐకెపి ఎపిఎం మోహిజ్, సీసీ విశ్వనాథం, ఏపీవో నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై రైలుకు ఎదురెళ్లిన వ్యక్తి

- కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకునే యత్నం
- రైల్వేగేట్ కీపర్ అప్రమత్తతో తప్పిన ప్రాణాప్రాయం



నవతెలంగాణ-నవీపేట్

ఓ వ్యక్తి రైలుకు ఎదురుగా బైక్‌పై వెళ్లి ఆత్మహత్యకు యత్నించిన ఘటన మండల కేంద్రంలోని దర్యాపూర్ రైలు పట్టాలపై గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలో గత కొన్ని రోజులుగా నివాసముంటున్న జగదీష్ కుటుంబ కలహాల కారణంగా మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకునేందుకు నపేట్‌లోని రైలు పట్టాలపై ద్విచక్ర వాహనంతో ఎదురుగా వస్తున్న రైలును ఢీకొట్టేందుకు వెళ్లాడు. సాయినగర్-తిరుపతి వీక్లీ రైలును ఢీకొట్టే ప్రయత్నం చేయగా రైల్వేగేట్ కీపర్ అప్రమత్తమై నవీపేట్ స్టేషన్ మాస్టర్‌కు సమాచారం ఇవ్వగా.. ఆయన లోకో పైలట్‌కు సమాచారం ఇవ్వడంతో రైలు నిలిచింది. వ్యక్తిని ఆర్‌పిఎఫ్ పోలీసులకు అప్పగించారు. కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం చేసినట్టు ఆర్పిఎఫ్ పోలీసులకు తెలిపాడు. జగదీష్‌కు భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

పల్లెల్లో 'స్థానిక' అలజడి

- స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇప్పటినుంచే నాయకుల కోలాహలం
- రిజర్వేషన్‌లపై ఉత్కంఠ
- పోటీకి సిద్ధమవుతున్న పలువురు
- ప్రజల మంచిచెడుకు హాజరవుతు ప్రజల్లో ఉన్నట్టు ప్రచారం
- జోర్‌దార్‌గా ఫ్లెక్సీల ఏర్పాటు

నవతెలంగాణ-మోపాల్

పల్లెల్లో స్థానిక సంస్థల ఎన్నికల అలజడి మొదలైంది. పోటీ చేసేందుకు సిద్ధపడుతున్న పలువురు ఆశావహులు తమ ప్రయత్నాల్లో నిమగ్నమైయ్యారు. రిజర్వేషన్‌లపై ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే గ్రామాలను చుట్టేస్తున్నారు. ప్రజల మంచిచెడులకు హాజరవుతూ తాము ప్రజల్లో ఉంటున్నామని పోటీలో ఉన్నట్టు సంకేతాలు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నాం కాబట్టి అత్యధిక స్థానాలు గెలిచే అవకాశం ఉందని భావిస్తున్న కాంగ్రెస్ నాయకులు.. ఎలాగైనా బరిలో నిలిచి గెలిచేందుకు ప్రయత్నాలు ఇది వరకే మొదలు పెట్టారు. కాగా ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత తమకు కలిసి వస్తుందని బీఆర్ఎస్ నాయకులు భావిస్తూ పోటీలో నిలిచేందుకు ముందు నిలుస్తున్నారు.

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా 530 గ్రామపంచాయతీలున్నాయి. కాగా పంచాయతీల పాలకవర్గాల పదవీ కాలం ఈ ఏడాది జనవరి 31వ తేదీతో ముగిసిన విషయం విదితమే. దీంతో పాటు మండల ప్రజాపరిషత్ సభ్యుల పదవీకాలం సైతం జూలై 3వ తేదీతో ముగిసింది. అసెంబ్లీ ఎన్నికలు పూర్తవ్వగా.. స్థానిక సంస్థల పాలన ముగియడంతో ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీ తన క్యాడర్ పెంచుకోవడంతో పాటు పరిపాలనపై దృష్టి సారించడంతో ఎన్నికలు నిర్వహించలేక పోయింది. దీంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమిస్తూ ప్రత్యేక అధికారుల పాలన తీసుకొచ్చింది. కాగా అసెంబ్లీ ఎన్నికలు పూర్తయి ఏడాది పాలన పూర్తవడంతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో పలు హామీలను అమలు చేసింది. ఆరు పథకాల్లో భాగంగా మహాలక్ష్మి కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి, రుణమాఫీ, గ్యాస్ సిలిండర్ సబ్సిడీ తదితర పథకాలు అమలు చేస్తుంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం దృష్టిసారించినట్టు సమాచారం. ఇప్పటికే గ్రామాల్లో ఓటరు నమోదు, వార్డుల వారీగా ఓటరు లిస్టు ప్రచురించి మార్పు చేర్పులకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది.

కాగా త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రానుండటంతో ఆశావహులు ఇప్పటి నుంచే పోటీ పడేందుకు సిద్ధపడుతున్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా రిజర్వేషన్ ఏది వస్తుందో ఎవరు పోటీ చేస్తారో ఈసారైనా మంచి సర్పంచ్ వస్తే బాగుంటది మన గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవచ్చని గ్రామ ప్రజలు సైతం చర్చించుకుంటున్నారు.



గత బిఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలు ఒకే రిజర్వేషన్ అమలు చేస్తూ అప్పుడు పంచాయతీరాజ్ చట్టంలో మార్పులు చేసింది. కానీ ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు మాత్రం కచ్చితంగా రిజర్వేషన్ మార్పు చేసే విధంగా అడుగులు వేస్తున్నట్టు సమాచారం. దానికి తోడే కులగణన కార్యక్రమం చేపట్టింది. దాదాపు రాష్ట్ర ప్రభుత్వం జనవరి 10 తేదీ తర్వాత నుండి మూడు విడుతల వారిగా గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేస్తుంది. ముఖ్యంగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలోని నాయకులు మాత్రం ఎప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు వస్తాయో అని ఎదురుచూస్తున్నారు. యే పదవులు లేకుండా గత పది సంవత్సరాల నుండి గ్రామాల్లో వారి ప్రభావం నిర్వీర్య మైపోయింది. తమ ప్రభుత్వం అధికారంలో లేకపోవడంతో యే ప్రభుత్వ ఆఫీసుకి వెళ్లిన కూడా కనీసం మర్యాద కూడా వారికి లేకుండా పోయింది. ఇప్పుడు వచ్చింది తమ ప్రభుత్వం కాబట్టి కచ్చితంగా అత్యధిక మొత్తంలో తమ మద్దతుదారులనే సర్పంచిగా ఎన్నుకునే విధంగా నాయకులు ఏర్పాట్లను ప్రారంభించారు. తమ పార్టీ అధికారంలో ఉంది కాబట్టి తమ పార్టీ నాయకులను గెలిపిస్తే ఖచ్చితంగా గ్రామం అభివృద్ధి పయనంలో నడుస్తుందని, ఒక్కసారి అధికారం ఇచ్చి చూడండి గ్రామ తలరాతనే మార్చేస్తామని ముఖ్యంగా రోడ్లు డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్న గ్రామాలలో మాత్రం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.



ఇప్పటికే గ్రామ పంచాయతీలు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంతర్గతంగా ఏర్పాట్లు చేస్తుంది. అందులో ముఖ్యంగా అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం 2018లో పంచాయతీరాజ్ చట్టంలో కీలక మార్పులు చేసింది. మరి ముఖ్యంగా పంచాయతీ సెక్రెటరీ స్థానంలో ఉపసర్పంచ్‌కి జాయింట్ చెక్ పవర్ ఇచ్చింది. దీనితో చాలా మట్టుకు వివిధ గ్రామపంచా యతీలలో సర్పంచ్‌కు, ఉపసర్పంచ్‌కు మధ్య విభేదాలు తలెత్తి గ్రామంలో గ్రూపు రాజకీయాలు ఏర్పడి గ్రామ అభివృద్ధి కుంటుపడింది. ఒకే పార్టీ మద్దతు గెలిచిన సర్పంచ్ ఉప సర్పంచ్ పరిస్థితి ఇలా ఉంటే, కొన్ని గ్రామలలో సర్పంచ్ ఒక పార్టీ ఉప సర్పంచ్ మరో పార్టీ మద్దతుతో గెలిచిన వ్యక్తులు ఉన్నారు. ఇద్దరి మధ్య గొడవలతో గ్రామపంచాయతీ కార్యాలయానికి తాళాలు వేసిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా గ్రామపంచాయతీ చెక్ పవర్ విషయంలో పాత విధానాన్ని కొనసాగిద్దామా లేదా సెక్రెటరీకి చెక్ పవర్ ఇద్దామా అనే విషయంలో తర్జనభర్జన పడుతుంది. కొందరీ రాజకీయ వక్తల అభిప్రాయం ప్రకారం.. ఇప్పుడు వచ్చే స్థానిక సర్పంచ్ ఎన్నికలలో సర్పంచ్‌కి, సెక్రటరీ కే చెక్‌పవర్ ఇవ్వాలని అలా ఇచ్చినప్పుడే అవినీతికి తావు లేకుండా ఉంటుందని ఎందుకంటే సర్పంచ్ పదవి కాలం ఐదు సంవత్సరాలు కానీ పంచాయతీ సెక్రెటరీ సర్వీసు 30 సంవత్సరాలు ఉంటుంది. అటువంటి అప్పుడు భయభ్రాంతులతో నిజాయితీగా అవినీతికి తావు లేకుండా అభివృద్ధికి పాటుపడతారు. దీనివలన గ్రామంలో నిష్పక్షపాతంగా అభివృద్ధి సాధ్యమవుతుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విగ్నేశ్

విద్యార్థుల ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోరా..?

- కాకతీయ ఘటనను సుమోటోగా తీసుకొని ప్రభుత్వమే దర్యాప్తు చేయించాలి
- విద్యార్థి జశ్విత్ రెడ్డి పోస్టుమార్టం రిపోర్ట్‌నూ బహిర్గతం చేయాలి : ఎస్ఎఫ్ఐ డిమాండ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రైవేట్ విద్యాసంస్థలలో విద్యార్థుల ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఎస్ఎఫ్ఐ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కాకతీయ ఘటనను సుమోటాగా తీసుకొని ప్రభుత్వం ఎన్ఐఏ తో దర్యాప్తు చేయాలని విద్యార్థి జశ్విత్ రెడ్డి పోస్ట్ మార్టం రిపోర్టును బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్ మాట్లాడుతూ.. కాకతీయ విద్య సంస్థలో వారం రోజుల కిందట విద్యార్థి మృతి చెందినా జిల్లా విద్యాశాఖ అధికారులు ఆ పాఠశాల పై ఇన్స్పెక్షన్ చేయకపోవడంపై అనుమానాలు కలుగుతున్నాయని అన్నారు. ఒక పక్క విద్యార్థి తల్లి తండ్రులు తన కొడుకు చనిపోయాడు అని బాధలో ఉంటే కాకతీయ విద్య సంస్థలు కేసు వాపసు తీసుకోవాలని బెదిరించడం సరికాదు అన్నారు. అదే విధంగా ప్రభుత్వం సుమోటా గా ఈ కేసును తీసుకొని ఎన్ఐఏ తో దర్యాప్తు చేయాలనీ డిమాండ్ చేశారు. వెంటనే అధికారులు కాకతీయ విద్య సంస్థల గుర్తింపును రద్దు చేయాలని కోరారు. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా ప్రభుత్వం పర్యవేక్షణ చేయాలని అదే విధంగా జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని అలాగే దోషులను కఠినంగా శిక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షురాలు దీపిక, నాయకులు దినేష్ వీణా, చక్రి నాయకులు పాల్గొన్నారు.

10న వికలాంగుల మహాధర్నా : సీపీఐ(ఎం) పిలుపు

నవతెలంగాణ-జుక్కల్/మద్నూర్

ఈ నెల 10న హైదరాబాదులో ఇందిరా పార్క్ ధర్నాచౌక్‌లో నిర్వహించే వికలాంగుల మహాధర్నను జయప్రదం చేయాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు సురేష్ గొండ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో వికలాంగులకు 6 వేలు పెన్షన్ ఇస్తామన్న హామీతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, కార్పొరేషన్ ద్వారా చదువుకున్న వికలాంగులకు ఐదు లక్షల రుణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వికలాంగ సోదరి సోదరులకు వారవులైన వారందరికీ మూడు చక్రాల రిక్షా, మూడు చక్రాల స్కూటీ, వికలాంగులకు సంబంధించిన కిట్లను ఈ ప్రభుత్వం వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

సర్వే డేటా ఎంట్రీలో వార్డ్ నెంబర్లను సరిచేయాలి

- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-కామారెడ్డి

సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ లో వార్డ్ నెంబర్లను సరిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ నుండి ఎంపీడీఓ లు, తహసీల్దార్లు, ఆర్డీఓ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇటీవల సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీ లో వార్డ్ నెంబర్లను తప్పుగా నమోదు చేయడం జరిగినట్లు గుర్తించడం జరిగిందని, ఓటరు జాబితా ప్రకారం ఇంటి నెంబర్ ల ప్రకారం వార్డ్ నెంబర్ వేయడం సరిచేసుకొని, సాఫ్టువేర్ అందుబాటులోకి రాగానే సరిచేయాలని తెలిపారు. ఇందుకు పంచాయతీ సిబ్బంది సిద్ధంగా ఉండాలని, వార్డ్ నెంబర్లను సరిచేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా మున్సిపల్ వార్డ్ లోని నెంబర్లను కూడా సరిచేసుకోవాలని అన్నారు. గ్రాడ్యుయేట్, టీచర్ల నియోజక వర్గంలోని పెండింగులో ఉన్న దరఖాస్తులను పరిశీలించి ప్రాసెస్ చేయాలని తహసీల్దార్లు, ఈఆర్ఓ లను కలెక్టర్ ఆదేశించారు. ఎస్ఎస్ఆర్ క్రింద ఫారం 6,7,8, లు లాగిన్ లో ఉన్న వాటిని తహసీల్దార్లు, ఆర్డిఒలు ఆయా ఫారాలను ప్రాసెస్ చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ రంగనాథ్ రావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, సీపీఓ రాజారాం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్

ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోట్లేదా..?
సీపీ ఆఫీస్‌కు ఫోన్ చేయండి

- అన్ని స్టేషన్‌లలో 8712659888 నెంబర్ బోర్డులు ఏర్పాటు
- ఇంచార్జీ పోలీస్ కమిషనర్ సింధుశర్మ వెల్లడి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్స్‌లో ప్రజల సౌకర్యార్థం సెంట్రల్ కాంప్లైంట్స్ సెల్ కోసం ప్రత్యేక ఫోన్ నెంబర్ ఏర్పాటు చేసినట్టు ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ గురువారం తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులను మొదట సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో అందించాలని, అయినా స్పందించకుంటే సీఐకి, ఆ తర్వాత ఏసీపీ దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. అక్కడ కూడా తగు చర్యలు తీసుకోనట్లయితే చివరికి పోలీస్ కమీషనరేటు కార్యాలయంలోని సెంట్రల్ కాంప్లైంట్స్ సెల్ నెంబర్ : 8712659888 సంప్రదించాలని ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం అన్ని పోలీస్ స్టేషన్స్ ముందు భాగంలో ఒక బోర్డు మీద సంబంధిత పోలీస్ అధికారుల ఫోన్ నెంబర్ పొందపరుచుతూ బోర్డు రూపంలో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.


మాట్లాడుతున్న సింధుశర్మ

కావున ఫిర్యాదు దారులకు సంబంధించిన ఏలాంటి ఫిర్యాదును అయిన సంబంధిత పోలీస్ స్టేషన్స్ యందు సంప్రదించాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదతో మాట్లాడి వారి ఫిర్యాదును త్వరితగతిన చర్యలు తీసుకునే విధంగా సంబంధిత అధికారులకు నిజామాబాద్ ఇంచార్జీ పోలీస్ కమీషనర్ సి.హెచ్. సిందూ శర్మ ఆదేశాలు జారీ చేశారు.

అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు

- ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబైల్ యాప్ ఆవిష్కరణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అర్హులకే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయనున్నట్టు చేయనున్నట్టు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులైన లబ్దిదారుల గుర్తింపు కోసం అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ రూపొందించిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే మొబైల్ యాప్‌ను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి గురువారం ఆవిష్కరించినట్టు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. నిజామాబాద్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ తదితరులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. 22500 కోట్ల రూపాయలను వెచ్చిస్తూ తొలివిడతగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3500 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేయనున్నామని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించినట్టు తెలిపారు.


సీఎం కార్యక్రమాన్ని వీక్షిస్తున్న కలెక్టర్, అధికారులు

నిరుపేద మహిళలు, వితంతువులు, దివ్యంగులు, వ్యవసాయ కూలీలు, ట్రాన్స్ జెండర్లకు, గిరిజన, దళిత కుటుంబాల వారికి ఇళ్ల మంజూరీలో ప్రాధాన్యత కల్పిస్తామని అన్నారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అర్హులైన వారినే లబ్ధిదారులుగా ఎంపిక చేసేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సర్వే యాప్ ద్వారా ఎంపిక చేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలు, మున్సిపల్ డివిజన్లు, వార్డులలో అధికారులతో కూడిన బృందాలు పర్యటిస్తూ ఇందిరమ్మ ఇళ్ల యాప్ ద్వారా సర్వే నిర్వహిస్తారని తెలిపారు. కనీసం 400 చదరపు అడుగుల స్థలంలో ఇంటి నిర్మాణం చేసుకునేలా, ఒక్కో ఇంటికి ప్రభుత్వం ఐదు లక్షల రూపాయల చొప్పున నిధులను లబ్దిదారుల ఖాతాలలో నాలుగు విడతలుగా జమ చేస్తుందని అన్నారు. పేద కుటుంబాల వారికి సైతం సామాజిక గౌరవం కల్పిస్తూ వారి సొంతింటి కలను సాకారం చేయాలనే ఉదాత్తమైన ఆశయంతో ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అవకతవకలకు ఆస్కారం లేకుండా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సమర్థవంతంగా సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయానికి అనుగుణంగా
సమగ్ర నివేదిక సమర్పిస్తాం

- బీసీ డేడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు వెల్లడి
- స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్ల దామాషాపై విజ్ఞాపనలు స్వీకరణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

స్థానిక సంస్థలలో బీ.సీ రిజర్వేషన్లు ఎలా ఉండాలనే దానిపై రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు బీసీ డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటయ్యిందని కమిషన్ చైర్మన్, విశ్రాంత ఐ.ఏ.ఎస్ అధికారి బూసాని వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రత్యేకించి గ్రామపంచాయతీలో, వార్డులో, జిల్లా, మండల పరిషత్ లలో ఎంత శాతం రిజర్వేషన్ ఉండాలో పేర్కొనే విషయమై కమిషన్ ఏర్పాటయ్యిందని చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా వివిధ జిల్లాలలో కుల సంఘాలు, వ్యక్తులు, సంస్థలతో అభిప్రాయ సేకరణ కొనసాగుతుందని, ఇప్పటివరకు 8 ఉమ్మడి జిల్లాలలో ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేసినట్టు తెలిపారు. ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలలో కూడా ప్రజాభిప్రాయ సేకరణ జరిపిన అనంతరం అన్ని అంశాలను కూలంకశంగా పొందుపరుస్తూ సమగ్ర నివేదిక సమర్పిస్తామని అన్నారు.

రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల దామాషాపై ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల నుండి అభ్యర్థనలు స్వీకరించేందుకు వీలుగా ఏర్పాటైన బీసీ డెడికేటెడ్ కమిషన్ గురువారం నిజామాబాద్ లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిజామాబాద్ ఉమ్మడి (నిజామాబాద్, కామారెడ్డి) జిల్లాలకు సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ జరిపింది. కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావు, కార్యదర్శి బి.సైదులు ఆయా కుల సంఘాల ప్రతినిధులు, ప్రజల నుండి రాతపూర్వకంగా విజ్ఞాపనలను స్వీకరించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయానికి చేరుకున్న కమిషన్ చైర్మన్ కు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పుష్పగుచ్చాలు అందించి స్వాగతం పలికారు. నాయి బ్రాహ్మణ సంఘం, విశ్వబ్రాహ్మణ సంఘం, బీసీ సంక్షేమ సంఘం, ముదిరాజ్, మేదరి, పూసల సంఘం, వడ్డెర సంఘం, చేతివృత్తుల, కుల సంఘాలు, కుమ్మరి, యాదవ, రజక, వీరభద్రీయ, నకాషీ, వాల్మీకి, ముస్లిం మైనారిటీ, దూదేకుల, బాగ్బాన్, మేర, గాండ్ల తేలికుల, మత్స్య సహకార తదితర సంఘాల ప్రతినిధులు తమతమ కులాలవారి ఆర్థిక, సామాజిక, విద్య, ఉద్యోగ, రాజకీయ స్థితిగతులను కమిషన్ చైర్మన్‌కు వివరిస్తూ విజ్ఞాపనలను సమర్పించారు.

ముఖ్యంగా కుల వృత్తులపై ఆధారపడి జీవనాలు వెళ్లదీస్తున్న తమకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని, బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలని, ఇప్పటివరకు స్థానిక సంస్థలలో స్థానం లేని కులాలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించేలా ప్రతిపాదించాలని, నాయిబ్రాహ్మణ వృత్తికి ప్రమాదకరంగా పరిణమించిన కార్పొరేట్ సంస్థలను నియంత్రిస్తూ తమకే పేటెంట్ హక్కులు కల్పించాలని, పూసల జాతిని ఎంబీసీ జాబితాలో చేర్చి కేంద్ర ప్రభుత్వానికి నివేదించాలని, చేతివృత్తులు, కుల సంఘాలను ఏ, బి, సి, డి వర్గీకరణ చేస్తే మేలు జరుగుతుందని, బీసీలకు రిజర్వేషన్ సీలింగ్ ఎత్తివేయాలని, మేదరి కులస్తులను ఇతర రాష్ట్రాల తరహాలో తెలంగాణాలో కూడా ఎస్టీ జాబితాలో చేర్చాలని, ముస్లిం మైనార్టీలకు జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల్లో 12.5 శాతం రిజర్వేషన్ వర్తింపజేయాలని, బాగ్బాన్ కులానికి గుర్తింపు కల్పించాలని ఆయా సంఘాల ప్రతినిధులు కమిషన్‌కు విజ్ఞాపనలు అందజేశారు.


విజ్ఞాపనలు స్వీకరిస్తున్న వెంకటేశ్వర్‌రావు

నిజామాబాద్ జిల్లాలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా, బీసీల జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థలలో రిజర్వేషన్లు ఉండాలనే అంశంపై ఎక్కువ మంది వారి విజ్ఞాపనలు అందించారని, కులాలను ఏ,బి,సి,డిగా వర్గీకరణ చేస్తే ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయాన్ని వెలుబుచ్చారని అన్నారు. అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికలలో ఇప్పటివరకు ప్రాతినిధ్యం లేని కులాలకు అవకాశాలు కల్పించాలని, తదితర అంశాలకు సంబంధించి విజ్ఞాపనలు సమర్పించినట్లు చైర్మన్ వివరించారు. ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ కలెక్టర్ సంకేత్ కుమార్, కామారెడ్డి జెడ్పి సీఈఓ చందర్ రాథోడ్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారిణి స్రవంతి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ అధికారి రమేష్ తదితరులు ఉన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి

- ఫూలే అంబేద్కర్ నగర్ ప్రజల విజ్ఞప్తి

నవతెలంగాణ-కంఠేశ్వర్

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని పులే అంబేద్కర్ నగర్ ప్రజలు విజ్ఞప్తి చేశారు. గురువారం బహుజన లెఫ్ట్ పార్టీ-బీఎల్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సబ్బని లత ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శాసన మండలి సభ్యులు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్‌ను కలిశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ శివారు ప్రాంతమైన గిరిరాజ్ కాలేజీ పక్కనగల సర్వే నెంబర్ 168లో గల ప్రభుత్వ భూమిలో పేదలు వేసుకున్న గుడిసెలకు ఇంటి పట్టాలు మంజూరు చేసి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇళ్ల స్థలాల సాధన పోరాట కమిటీ సభ్యులు దడ్వాయి స్వామి, కిషోర్, స్వాతి, చంద్ర గౌడ్, శాంత బాయి, రాధా, లక్ష్మి, ఉషా, వాణి, రేఖా, రాధా బాయి, సూర్య వంశీ శాంత బాయిలు పాల్గొన్నారు.

15 శాతం ఎస్సీ రిజర్వేషన్లను వర్గీకరించాలి

- మాదిగ జాగృతి సంఘం (ఎంజెఎస్)

నవతెలంగాణ-కంఠేశ్వర్

15 శాతం ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్లను ఎస్సీ జనాభా దామాషా ప్రకారం వర్గీకరించాలని మాదిగ జాగృతి సంఘం (ఎంజెఎస్) నిజామాబాద్ జిల్లా కన్వీనర్ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో గల ఎస్సీ జనాభాలో 70శాతం ఉన్న మాదిగ జనాభాకు 10 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని తెలిపారు. 30శాతం లోపు ఉన్న మాలలకు 4శాతం, 1శాతం లోపు ఉన్న ఎస్సీ ఉపకులాలకు ఒక శాతం రిజర్వేషన్లను కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ ప్రతినిధులు సంతోష్, బాగేంద్ర, రమేష్, సాయినాథ్, రాజు, వినోద్, సురేష్, గంగాధర్, రవి, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ



కార్మికులకు దుప్పట్లు అందజేస్తున్న సీఐ శ్రీధర్‌రెడ్డి

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని కిసాన్ నగర్ గ్రామంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కార్మికులకు ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. కిసాన్ నగర్‌లోని పైప్ కంపెనీ, బీడీ కంపెనీ, రైస్ మిల్ కార్మికులు, ఇటుక బట్టీల కార్మికులకు దుప్పట్లు అందజేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు జ్ఞాన సాగర్ రెడ్డి, దినేష్ పటేల్, చాకులింగం, పెండం జీవన్, వంశీరెడ్డి, కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆటోల రాష్ట్ర బందును విజయవంతం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ ప్రగతిశీల ఆటో అండ్ మోటార్ డ్రైవర్స్ యూనియన్ (ఐఎఫ్టీయు) డిసెంబర్ 7న జరిగే రాష్ట్రవ్యాప్త ఆటో బంద్ నిర్వహించనున్నది. గురువారం మోపాల్ మండల కేంద్రంలో ప్రచారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఐఎఫ్టీయు జిల్లా కార్యదర్శి, ఆటో యూనియన్ నాయకుడు ఎం.శివకుమార్, బండి మీద నరసయ్యలు మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికలలో ఆటో డ్రైవర్లకు, లైట్ మోటార్ వెహికల్ డ్రైవర్లకు ప్రతి ఒక్కరికి రూ.15000 ఇస్తానని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని దానిని ఇంతవరకు అమలు చేయలేదని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొందరు యూనియన్ నాయకులమనే పేరుతో పైరవీలు చేస్తూ ఆటో డ్రైవర్లను వేధిస్తున్నారని తెలిపారు. కావున ప్రభుత్వం తక్షణమే చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ 7న జరిగే రాష్ట్రవ్యాప్త బందును విజయవంతం చేయాలని ఆటో డ్రైవర్లను, ఓనర్లను కోరారు. కార్యక్రమంలో మోహన్, సలీం, బాబా, భూమయ్య, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

7న జరిగే ఆటోబందును జయప్రదం చేయండి

ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో 7న బందుకు సంబంధించి ఆటో కార్మిక సంఘాల నాయకులతో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య మాట్లాడుతూ.. ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ.15 వేలు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా నష్టపోయిన ఆటో కార్మికులను ఆదుకోవాలని కోరారు. తదితర డిమాండ్లతో నిర్వహించే బంద్‌ను కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.హనుమాన్లు, నగర అధ్యక్షులు బి.శ్రీనివాస్, కార్యదర్శి జబ్బార్, వర్కింగ్ ప్రెసిడెంట్ షాదుల్, ఉపాధ్యక్షులు రఫీ ఖాన్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

6,7న నిరాహార దీక్ష చేస్తాం

- సమ్మె నోటీసులు అందజేత



సమ్మె నోటీసును అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-మోర్తాడ్

సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మండల సిఆర్‌పిలు విద్యాశాఖ అధికారి సమ్మిరెడ్డికి సమ్మె నోటీసులను గురువారం అందజేశారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల ఆరో తేదీ, ఏడో తేదీల్లో మండలకేంద్రాల్లో నిరాహార దీక్ష చేయనున్నట్టు తెలిపారు.

అప్పటివరకు ప్రభుత్వం స్పందన లేకపోతే పదో తేదీ నుండి నిరవధిక సమ్మె నిర్వహిస్తామని అన్నారు. ప్రభుత్వం తక్షణమే ఎమ్మార్సీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్పీలు సాయిరాం, సురేష్, పరిమళ, పిటిఐలు రాము, భూలక్ష్మి, నవీన్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శికి సన్మానం

నవతెలంగాణ-వర్ని



సన్మానించిన నాయకులు

కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో వర్ని మండలం కూనిపూర్ గ్రామానికి చెందిన కృష్ణ రెడ్డి కామారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా గెలుపొందారు. గురువారం పీసీసీ డేలిగేట్ కూనిపూర్ రాజా రెడ్డి నివాసంలో యూత్ కాంగ్రెస్ నాయకున్ని శాలువాతో సన్మానం చేశారు. యూత్ కాంగ్రెస్ నుంచే పలువురు నాయకులు ఎదిగి, మంచి పదవులు పొందారని అన్నారు. యువతతో పాటు కార్యకర్తల మనసుని గెలిపించుకునేలా పని చేయాలని తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి :ఎంఈవో

- ఎంపీపీఎస్ పాఠశాల తనిఖీ

నవతెలంగాణ-మోర్తాడ్

మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలను విద్యాశాఖ అధికారి సమ్మిరెడ్డి గురువారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకులతో మాట్లాడుతూ.. నాణ్యమైన భోజనాన్ని అందిస్తూ ఇబ్బందులు ఉంటే పాఠశాల ఉపాధ్యాయులకు సూచించాలని తెలిపారు. అనంతరం బాలికల పాఠశాలను ఆయన సందర్శించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, ప్రగతి, మొయినుద్దీన్ ఉన్నారు.

సేంద్రియ ఎరువులు వాడి నేల సాంద్రత పెంచాలి

- ప్రపంచ మృత్తిక దినోత్సవం సందర్భంగా రైతులకు అవగాహన

నవతెలంగాణ-మోర్తాడ్/ మోపాల్ /డిచ్‌పల్లి

ప్రపంచ మృత్తిక నేల దినోత్సవం స్థానిక వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి హరీష్ మాట్లాడుతూ.. భూమి ఆరోగ్యం మట్టిలో సూక్ష్మజీవులు ప్రాముఖ్యత, మట్టి సంరక్షణ సేంద్రియ ఎరువులు వినియోగం పచ్చిరొట్టె ఎరువుల ఆవశ్యకతకు వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. నేల సాంద్రత కోసం రైతులు అధిక ఎరువులు వాడకూడదని సేంద్రియ ఎరువుల వాడి సాంద్రత పెంచాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి హరీష్ విస్తీనా అధికారులు శ్రీలత,లక్పతి ,మహేష్, రాజేశ్వర్, గంగాధర్ పాల్గొన్నారు.

మోపాల్ : ప్రపంచ మృత్తిక దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో మట్టి నమూనా సేకరణ, సేకరించే విధానం, మట్టిలో అధిక రసాయనాల వినియోగం చేయడం వల్ల వచ్చే నష్టాల గురించి కూడా క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో సాయిల్ టెస్టింగ్ లాబరేటరీ ఏడిఏ పద్మావతి, ఏఈఓ రంజిత్ కుమార్, రైతులు సాగర్, చిరంజీవి గణపతి తదితరులు పాల్గొన్నారు

వరి మొళ్లను కాలిస్తే నష్టాలే ఎక్కువ

జిల్లా వ్యవసాయశాఖ అధికారి వాజిద్ హుస్సేన్

డిచ్‌పల్లి : వరి మొళ్లను కాల్చడం వల్ల లాభం కంటే వచ్చే నష్టాలు ఎక్కువని రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు. గురువారం మండలంలోని రైతు వేదిక నడిపల్లిలో ప్రపంచ మృత్తిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ అంజయ్య, శ్వేత, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ నిజామాబాద్ రూరల్ ఏడిఏ ప్రదీప్ కుమార్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేల సంరక్షణ యొక్క ఆవశ్యకత, వరి మొళ్లను కాల్చడం వల్ల వచ్చే నష్టాలు, రైతులు



మోపాల్: మట్టి నమూనా సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు

వ్యవసాయంలో ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కారాలపై చర్చించి పలు సూచనలు, సలహాలను అందజేశారు. పంటల్లో వచ్చే మార్పులు చేర్పులపై వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు. ఇష్టనుసారంగా మందులు వాడటంతో వచ్చే నష్టాలపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో డిచ్ పల్లి మండల వ్యవసాయ అధికారిని సుధ మధురి, మండల వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులు పాల్గొన్నారు.

విద్యార్థి జశ్విత్‌రెడ్డి మరణంపై విచారణ జరపాలి

- తెలంగాణ విద్యార్థి పరిషద్ జిల్లా అధ్యక్షులు బొబ్బిలి కళ్యాణ్
- సీఐడీ విచారణకు డిమాండ్(టీజీవీపీ)

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జశ్వంత్‌రెడ్డి మరణానికి సంబంధించి పూర్తి నిజాలను వెలికితీయడానికి (సీఐడీ) ద్వారా నిష్పక్షపాత విచారణ జరపాలని తెలంగాణ విద్యార్థి పరిషద్ జిల్లా అధ్యక్షులు బొబ్బిలి కళ్యాణ్ అన్నారు. గురువారం అదనపు జిల్లా కలెక్టర్ కిరణ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలోని కాకతీయ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి జస్విత్‌రెడ్డి అనుమానాస్పద రీతిలో మరణించిన సంఘటన అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఘటనలో పాఠశాల యాజమాన్యం బాధ్యతను విచారణ చేసి, నిర్లక్ష్యం లేదా తప్పు జరిగిందని నిర్ధారణ అయితే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఘటనపై పాఠశాల యాజమాన్యం తీరుతో విద్యార్థుల భవిష్యత్‌పై పలు అనుమానాలు కలుగుతున్నాయన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరుగడం కోసం ప్రభుత్వం వెంటనే స్పందించాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ డిమాండ్ చేస్తుందన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు అఖిల్ సుజిత్, మనోహర్, రియాన్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రాణాలు పోతున్న అధికారులు పట్టించుకోరా

కంఠేశ్వర్ : ప్రైవేట్ విద్యాసంస్థలలో విద్యార్థుల ప్రాణాలు పోతున్న ఉన్నత అధికారులు పట్టించుకోర అని, ప్రభుత్వం ఎస్ఐఏతో దర్యాప్తు చేయాలని, విద్యార్థి జస్విత్‌రెడ్డి పోస్ట్ మార్టం రిపోర్టును బహిర్గతం చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్ మాట్లాడుతూ.. కాకతీయ విద్య సంస్థలో వారం రోజుల కిందట విద్యార్థి మృతి చెందిన జిల్లా విద్య శాఖ అధికారులు ఆ పాఠశాలపై ఇన్స్పెక్షన్ చేయకపోవడంపై అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ప్రభుత్వం సుమోటాగా ఈ కేసును తీసుకొని ఎస్ఐఏతో దర్యాప్తు చేయాలనీ డిమాండ్ చేశారు. వెంటనే అధికారులు కాకతీయ విద్య సంస్థల గుర్తింపును రద్దు చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి విద్యార్థి కుటుంబానికి న్యాయం చేయాలని, అలాగే దోషులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షురాలు దీపిక, నాయకులు దినేష్ వీణా, చక్రి, తదితరులు పాల్గొన్నారు.

అవార్డులు బాధ్యతను పెంచుతాయి

- ప్రముఖ కవి విమర్శకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి
- వైభవంగా సరస్వతీరాజ్ పురస్కారాల ప్రదానం

నవతెలంగాణ-కంఠేశ్వర్

సరస్వతీ రాజ్ హరిదా తెలంగాణ విశిష్ట స్థాయి సాహిత్య పురస్కారం తనకు ప్రకటించడం వల్ల ఎంతో ఆనందం కలిగిందని, దానితో పాటు బాధ్యత పెరిగిందని ప్రముఖ కవి, విమర్శకుడు డాక్టర్ ఏనుగు



అవార్డును అందుకున్న డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి

నరసింహారెడ్డి అన్నారు. బుధవారం రాత్రి నవ్యభారతి గ్లోబల్ స్కూల్ ఆవరణలో జరిగిన హరిదా రచయితల సంఘం ఆరవ మహాసభలో ఆయన మాట్లాడారు. తెలుగు సాహిత్యంలో ఎంతో కృషి చేసిన డాక్టర్ సామల సదాశివ, నందిని సిద్ధారెడ్డి, ఆచార్య ఎన్.గోపి వంటి ప్రముఖులు ఐదుగురు ప్రతిభామూర్తులకు ఈ అవార్డు అందజేశారని తెలిపారు. ఆరవ వ్యక్తిగా తనకు అందించడం అంటే నా కృషి పట్ల, నా బాధ్యత పట్ల నిజామాబాద్ సాహిత్య లోకానికి ఉన్న నమ్మకమని తాను నమ్ముతున్నానన్నారు. కార్యక్రమంలో తిరుమల శ్రీనివాస్ ఆర్య, డాక్టర్ మద్దుకూరి సాయిబాబు, డాక్టర్ కాసర్ల నరేష్ రావు, డాక్టర్ గంట్యాల ప్రసాద్, జి.నరసింహస్వామి, నరాల సుధాకర్, కందకుర్తి యాదవరావు, డాక్టర్ శిరీష్, డాక్టర్ సవితా రాణి, జిల్లా సాహితీవేత్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వికలాంగులు కాదు.. ప్రతిభావంతులు

- ప్రభుత్వం సౌకర్యాలు వినియోగించుకోవాలి
- ఎంఈఓ శ్రీనివాస్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

దివ్యాంగులు వికలాంగులు కాదని, ప్రతిభావంతులని, ప్రభుత్వం కల్పించే అన్ని సౌకర్యాలు వినియోగించుకోవాలి చదివే సర్వస్వంగా భావించాలని ఎంఈఓ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రపంచ జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని శారీరక, మానసిక, అంధులు, వినికిడి సమస్యలు గల దివ్యాంగులకు పాటల పోటీలు నిర్వహించి బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లింగన్న మాట్లాడుతూ.. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల



మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాస్

విద్యాశాఖ అధికారి ఎంఈఓ శ్రీనివాస హాజరై మాట్లాడుతూ దివ్యాంగులు వికలాంగులు కారని ప్రతిభావంతులని వారిని ప్రోత్సహించాలని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను వినియోగించుకుని అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం మండలంలోని బాలనగర్ గ్రామ పంచాయతీ పాఠశాలలో పనిచేస్తున్న దివ్యాంగులైన నర్సయ్య అనే ఉపాధ్యాయుని శాలువాతో ఘనంగా సన్మానించారు. హై స్కూల్ లో పని చేస్తున్నటువంటి స్కూల్ అసిస్టెంట్ గౌతమి వికలాం గుల ప్రత్యేక ఉపాధ్యాయురాలిని, కవిత సెంటర్లో పనిచేస్తున్న స్వామి, పద్మజ టీచర్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. బహుమతులతో పాటు పండ్లు, బిస్కెట్ పాకెట్లను అందజేశారు. కార్యక్రమంలో సిఆర్పీలు, ఉపాధ్యాయులు గోపి, సుభాషిని పాల్గొన్నారు.

జిల్లా మహాసభను జయప్రదం చేయండి

- మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి జిల్లా మహాసభను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి తోపునూరు చక్రపాణి అన్నారు. గురువారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రెండవ జిల్లా మహాసభ గోడప్రతులు ఆవిష్కరించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. రెండు సంవత్సరాలకు ఒకసారి జరగబోయే మహాసభల్లో గతంలో జరిగిన కార్యక్రమాలు, భవిష్యత్ కార్యక్రమాలపై చర్చ ఉంటుందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చాలీచాలని స్లాబ్ రేటు ఇస్తూ నాణ్యమైన భోజనం పెట్టాలని, మెనూ ప్రకారం పెట్టాలని కార్మికులను వేధింపులకు గురిచేస్తున్నారని అన్నారు. మెనూ ప్రకారం పెట్టాలంటే ఒక పిల్లవాడికి స్లాబరేట్ 20, నుండి 25 రూపాయలు కావాలని తెలిపారు. జిల్లా మహాసభకు జిల్లాలోని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ కార్మికులందరూ తరలి రావాలని కోరారు. సమావేశంలో హనుమాన్లు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నర్సింగ్ రావు, సాయిలత, లింగవ్వ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుని మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి

- స్టేట్ టీచర్స్ యూనియన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఇజాజ్ అహమ్మద్ మరణానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని స్టేట్ టీచర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు ధర్మేందర్, శ్రీకాంత్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. భవిష్యత్ కార్యాచరణపై ఉపాధ్యాయ సంఘాలతో వెంటనే ప్రభుత్వం చర్చించాలని కోరారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తడపాకల్ గ్రామంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనారోగ్య కారణాలతో చికిత్స చేయించుకున్న మట్టెల రాజలింగంకు 51 వేలు, సుద్దాల సౌజన్యకు 32 వేలు, రాజేష్‌కు 24 వేలు, సరితకు 23 వేల రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ కింద నిధులు మంజూరు కావడంతో చెక్కులను బాధితులకు అందజేశామని తెలిపారు. సీఎం రిలీఫ్ ఫండ్ నిధుల మంజూరుకు కృషిచేసిన బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ రెడ్డికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జింక అనిల్, శ్రీనివాస్, రాజు, సాయన్న, అశోక్, రాము, తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి

- జిల్లా ఐద్వా కమిటీ ఆధ్వర్యంలో వినతి



వినతి పత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాజీవ్ గృహకల్ప అపార్ట్మెంట్స్‌లో మంచినీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఐద్వా నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత, జిల్లా అధ్యక్షురాలు అనిత సంబంధిత అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. నాగారం రాజీవ్ గృహకల్ప అపార్ట్మెంట్స్‌లో బోరు రిపేర్ కావడం వల్ల మంచినీటి సమస్య తీవ్రత పెరిగిందన్నారు. గతంలో ఎన్ని సార్లు రిపేర్ వచ్చిన స్థానికులుగా ఉన్న వాళ్లు జేబు నుంచి డబ్బులు ఖర్చు పెట్టి చేయించారని తెలిపారు. కానీ ఇప్పుడు ఆ మోటర్ పనికిరాదని, కొత్త మోటర్ కావాలని మెకానిక్ చెప్పారని అన్నారు. వెంటనే కొత్త మోటర్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అప్పటివరకు నీటి ఇబ్బందులు లేకుండా ట్యాంకర్ ద్వారా సరఫరా చేయాలని కోరారు.

విద్యాశాఖలో అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలి

- ఏఐఎస్ఎఫ్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

నిజామాబాద్ రూరల్ ప్రాంతంలో అనుమతి లేకుండా 2,3 విద్యాసంస్థలు వచ్చాయని, ఈ విషయంపై రూరల్ ఎంఈఓ ఇప్పటివరకు స్పందించలేదని, నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వరంగల్ ఆర్జెడి ఆఫీసులో ఫిర్యాదు చేసినట్టు ఏఐఎస్ఏ నాయకులు గురువారం తెలిపారు. తక్షణమే ఎంఇఓపై చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రధాన కార్యదర్శి జ్వాల కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లా విద్యాశాఖ వారు దానిపై స్పందించలేదని, గతంలో డీఈవో దుర్గాప్రసాద్ నారాయణ పాఠశాల ఫేక్ డాక్యుమెంట్స్ ఉన్నాయని ఆర్జెడికి ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆదివారం సైతం టెస్టులు పెడుతూ విద్యార్థులకు ఒత్తిడికి గురి చేస్తున్న నారాయణ పాఠశాల పైన చర్యలు తీసుకోవాలని ఆదివారం పాఠశాలలు మూసి ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్, రాష్ట్ర అధ్యక్షులు అలీ, సహాయ కార్యదర్శి సాగర్, జిల్లా నాయకులు అజయ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రిలియంట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి :ఏఐపీఎస్‌యు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిబంధనలకు విరుద్ధంగా 10వ తరగతి పరీక్ష రుసుం వెయ్యి రూపాయలు వసూలు చేస్తున్న బ్రిలియంట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐపిఎస్‌యు జిల్లా కార్యదర్శి బోడ అనిల్ అన్నారు. అఖిల భారత ప్రగతిశీల విద్యార్థి సంఘం (ఏఐపిఎస్‌యు) నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎంఈఓ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి బోడ అనిల్ మాట్లాడుతూజజ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా 10 తరగతి విద్యార్థుల నుంచి 1000 రూపాయలు వసూలు చేసిన బ్రిలియంట్ పాఠశాల యజమాన్యం పై చర్యలు తీసుకుంటూ అదనంగా తీసుకున్న పరీక్ష రుసుం తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులకు చెల్లించాలని అన్నారు. కమర్షియల్ బిల్డింగ్‌లో నడిపిస్తున్న బ్రిలియంట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో పోరాటం చేయాల్సి ఉంటుందని అన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు ఠాకూర్ గోపాల్ సింగ్, నగర కార్యదర్శి సందీప్, శివ పాల్గొన్నారు.

ఐఇసి మెటీరియల్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలులో భాగంగా తెలంగాణ సాక్స్ ఆదేశాల మేరకు నిజామాబాద్ ఏఆర్టిలో ఐఇసి మెటీరియల్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ దేవి నాగేశ్వరి, నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి సూపరెంట్ డాక్టర్ ప్రతిమరాజ్, డాక్టర్ వివి రావు ఏఆర్టి నోడల్ ఆఫీసర్, ఏఆర్టి మెడికల్ ఆఫీసర్స్ డాక్టర్ శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ ఇందూర్ ప్రవీణ్, డాక్టర్ చిట్టిల్లా సంతోష్ కుమార్, డిస్ట్రిక్ ప్రోగ్రాం మేనేజర్ చెల్లా సుధాకర్, ఏఆర్టి స్టాఫ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-లింగంపేట్

ఎమ్మెల్యే ఆదేశంతో లింగంపేట్ మండలంలోని ఆయా గ్రామాలలో గురువారం ఇంటి వద్దకు వెళ్లి కల్యాణ లక్ష్మి చెక్కులను అందజేసినట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుర్ర నారా గౌడ్ ఆధ్వర్యంలో లింగంపేట్ మండలం కేంద్రంలోని గల మోతే, ఎల్లారం, అయ్యపల్లి, పర్మల్ల, ఎక్కపల్లి సజ్జన్పల్లి, పోల్కంపేట్, కన్నాపూర్, తదితర గ్రామాల్లో 41 మంది చెక్కులు ఇంటింటికి వెళ్లి అందజేశారు. దళారులను ఆశ్రయించకుండా దళారుల ప్రమేయం లేకుండా కల్యాణ లక్ష్మి లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి నేరుగా చెక్కులు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సమన్వ యు కమిటీ సభ్యులు వంజరి ఎల్లమయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లు, గోపాల్, ఫుల్ సింగ్, నాగరాజు బాలయ్య అశోక్, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ నగేష్, తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడికి సన్మానం



నవతెలంగాణ-లింగంపేట్

జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మమ్మద్ కాశీఫ్ కు గురువారం ఆయన నివాసంలో మండల కాంగ్రెస్ నాయకులు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. బుధవారం వెల్లడించిన యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో జిల్లా ఉప అధ్యక్షులు విజయం సాధించిన కాసిఫ్ మొయినొద్దీన్ కు కలిసి అభినందించారు. పార్టీ కోసం, కార్యకర్తల కోసం కష్టపడి పని చేస్తానని పార్టీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్తానన్నారు.

మట్టి పరీక్షలతో రైతులకు ఉపయోగం

- **జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్**

నవతెలంగాణ-లింగంపేట్/తాడ్వాయి/జుక్కల్

రైతులు తమ పంట పొలాల్లో మట్టి నమూనాలతో పరీక్షలు చేయిస్తే దానికి అనుగుణంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయని జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ రైతులకు వివరించారు. లింగంపేట్ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మృత్తిక (నేల) దినోత్సవం సందర్భంగా గురువారం రైతులకు నేల ప్రాముఖ్యత వివరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులు తమ వరి పొలాల్లో మిగిలిపోయిన వరి కొయ్యలను కాల్చకుండా భూమిలోని కలియ దున్నడంవల్ల నేల భూసారం పెరుగుతుందని తెలిపారు. అలాగే రైతులకు తమ పొలాల్లో మట్టి నమూనాలో ఎలా సేకరించాలో వివరించారు. మట్టి నమూనలతో మట్టి పరీక్షలు చేయించినట్లయితే ఏ పంట సాగు చేయాలో రైతులకు అర్థమవుతుందన్నారు. ప్రతి రైతు తమ పంట పొలాల్లో మట్టి నమూనాలు సేకరించి మట్టి పరీక్షలు చేయించుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్ వ్యవసాయ విస్తీర్ణధికారి మధుసూదన్ సంతోష్ రాకేష్ నవ్య అమర్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి/జుక్కల్

నేలను కాపాడుకోవాల్సిన బాధ్యత రైతులపైన ఉందని ఏవో నరసింహులు అన్నారు. గురువారం ఎర్ర పహాడ్‌లో ఏర్పాటుచేసిన మృతిక దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పచ్చిరొట్ట ఎరువులు వాడినట్లయితే భూసారం పెరిగి పంటలకు అనుకూలంగా ఉంటుందని, భూసారం తగ్గకుండా ఖనిజాలతో ఉండి విత్తిన మొక్కలు ఏపుగా పెరిగి పంటలు దిగుబడిగా వస్తాయని సూచించారు. అనంతరం సేంద్రియ ఎరువుల విధానం పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రావణ్‌కుమార్. ఆయా క్లస్టర్ల ఏఈఓలు, రైతులుగంగారెడ్డి, ఆనంద్, భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేల ప్రాముఖ్యతను తెలుసుకోవాలి..

జుక్కల్ : మండలంలోని నాగుల్ గావ్ గ్రామ క్లస్టర్ పరిధిలోని రైతు వేదిక అందు ప్రపంచ మృత్తిక దినోత్సవం సందర్భంగా నేల యొక్క ప్రాముఖ్యత, నేల యాజమాన్యం, యాసంగి పంటల యాజమాన్యంపైన అవగాహన సమావేశం నిర్వహించారు. నేల యొక్క భూసారాన్ని పెంచటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి రైతులకు గ్రామ వ్యవసాయాధికారి సతీష్ వివరించారు. ఈ సమావేశానికి విజయ్ పటేల్, అనిల్ గొండ,గుండేవర్ ఉమేష్, అనిల్ కుమార్, పాటిల్ శివాజీ, హైబతి గంగాధర్, గుణవంత్ రావు, జెట్టి బాలాజీ, మెత్రే బాలాజీ, రాజు, తదితరులు పాల్గొన్నారు.



జుక్కల్: రైతు వేదికలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి సతీష్

మద్నూర్ టూ బోధన్ మీదుగా రోడ్డు

జాతీయ రహదారి నిర్మాణానికి రూ.634 కోట్లు : ఎమ్మెల్యే

నవతెలంగాణ-మద్నూర్

జుక్కల్ నియోజకవర్గంలోని పూర్తిగా వెనుకబడ్డ మద్నూర్ మండల అభివృద్ధిలో భాగంగా జాతీయ రహదారుల నిర్మాణాలకు నిధులు మంజూరైనట్టు ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్నూర్ టూ సిర్పూర్ మీదుగా బోధన్ వరకు జాతీయ రహదారి నిర్మాణానికి రూ.634 కోట్లు మంజూరైనట్టు తెలిపారు. ఇప్పటికే సంగారెడ్డి-నాందేడ్-హైదరాబాద్ 161వ నేషనల్ హైవే పూర్తి అయి జుక్కల్ నియోజకవర్గానికి వన్నె తెచ్చిందని, ఇప్పుడు మద్నూర్ నుండి సిర్పూర్ మీదుగా బోధన్ వరకు రోడ్డు నిర్మాణానికి 634 కోట్ల రూపాయల నిధులు మంజూరు కావడంతో మరింత అభివృద్ధి అయ్యే అవకాశం ఉందని కాంగ్రెస్ నాయకులు పేర్కొంటున్నారు.

టాడా జిల్లా అధ్యక్షునిగా ఏవో కిషన్



జిల్లా అధ్యక్షున్ని సన్మానించిన పలువురు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

కామారెడ్డి జిల్లా టాడా (తెలంగాణా అగ్రి డాక్టర్స్ అసోసియేషన్) ఎన్నికలు బుధవారం రాత్రి కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించారు. ఈ ఎన్నికలు రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కర్ ఆధ్వర్యంలో జరగ్గా పెద్దకొడప్ గల్ మండల ఏవో గా విధులు నిర్వహిస్తున్న కిషన్ ను టాడా అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతు తనపై నమ్మకం ఉంచి టాడా అధ్యక్షులుగా ఎన్నుకున్న వారికి రుణపడి ఉంటానని, టాడాల సమస్యలపై పోరాటం చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన టాడా కార్యవర్గ సభ్యులు ఈ కార్యక్రమానికి విశిష్ఠ అతిథిగా హాజరైన జిల్లా ్ వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ నాయుడును సన్మానించారు. ఈ కార్యక్రమంలో టాడా ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, చైర్మన్ శ్రీనివాస్ రావ్, వైస్ చైర్మన్ రాజు, పబ్లిసిటీ అధ్యక్షురాలు మహేశ్వరి, కోశాధికారి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

'సోమూర్ శివారుకు దారి చూపండి'

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని సోమూరు గ్రామ శివారు ప్రాంతానికి రహదారి లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఆ గ్రామ ప్రజలు, వ్యవసాయ రైతులు జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావుకు విన్నవించారు. సోమూర్ గ్రామ శివారు ప్రాంతానికి రహదారులు ఉండకపోవడం ఏమిటని గ్రామ శివారు ప్రాంతం ప్రకారం వ్యవసాయదారులకు రహదారులు చూపించాలని ఎమ్మెల్యే తహసీల్దార్‌కు రాసిన కాపీని సోమూరు గ్రామస్తులు, ధన్నూర్ గ్రామ పెద్దలు దేవిదాస్ పటేల్ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎండి ముజీబ్‌కు గురువారం అందజేశారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై విజయ్ కొండ

నవతెలంగాణ-మద్నూర్

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని ఎస్సై విజయ్ కొండ అన్నారు. గురువారం పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు నిబంధనల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటోలకు సంబంధించిన అన్ని పేపర్స్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, డ్రెస్ కోడ్ పాటించాలన్నారు. ప్రయాణికులను పరిమితికి మించి ఎక్కించుకోకూడదని పలు విషయాలపై సూచించారు. మద్నూర్ బస్టాండ్‌లో నిలిపే ఆటోలు ప్రజలకు ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందికరంగా నిల్పకుండా ఉండాలని తెలియజేశారు. కార్యక్రమంలో పోలీస్ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

బడి బయట పిల్లల గుర్తింపు



బడీడు పిల్లలను గుర్తించిన అధికారులు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని ముస్తాపూర్ గ్రామ సమీపంలో ఇటిక బట్టి వద్ద ఉన్న బడిమానేసిన పిల్లలను గురువారం గుర్తించారు. ముస్తాపూర్ గ్రామ పరిధిలో ఇటుక బట్టి తయారీ నిమిత్తం బట్టిలో పనిచేయుటకు ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా వలస కార్మికులు వచ్చారు. వారితో పాటు వారి పిల్లలు కూడా ఉన్నారు. వారిని గురువారం రోజున బట్టి ప్రాంతానికి వెళ్లి బడి బయట పిల్లలను గుర్తించారు. మొత్తం పిల్లలు 14 మంది పిల్లలను గుర్తించారు. వీరికి త్వరలోనే బట్టి ప్రదేశంలో పాఠశాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఆర్పి విజయ్ కుమార్ మరియు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ రావు సంజీవులు మరియు బట్టి యజమానులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట మండలంలోని మాటూర్, మాసన్ పల్లి , ఆత్మకూర్ , జలాల్పూర్ గ్రామాలలో ఎంపీడీవో ప్రభాకర్ చారి మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఏజెన్సీ నిర్వాహకులకు ఆయన ఆదేశించారు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆయన పేర్కొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- **తహసీల్దార్ వేణుగోపాల్**



మాట్లాడుతున్న తహసీల్దార్ వేణుగోపాల్

నవతెలంగాణ-పిట్లం

మధ్యాహ్న భోజన ఏజెన్సీ వారు విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మండల తహసీల్దార్ వేణుగోపాల్ ఆదేశించారు. గురువారం మండల విద్యా వనరుల భవనములో విద్యాధికారి దేవి సింగ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మధ్యాహ్న భోజన పథకం ఏజెన్సీ వారికి ఫుడ్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయా పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వహించే ఏజెన్సీ వారు వంట చేయు పరిసరాలను, పాత్రలను శుభ్రత పాటిస్తూ బియ్యం సైతం కూరగాయలు శుభ్రపరచి నాణ్యమైన భోజనంను విద్యార్థులకు అందించాలని సూచించారు. మండల నోడల్ అధికారి రమణ రావు, ఆయా పాఠశాలల ప్రధానో పాధ్యాయులు, మధ్యాహ్న ఏజెన్సీ నిర్వాహకులు, పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని విద్యాశాఖ సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నిరసన కార్యక్రమాల సమ్మె నోటీస్ మండల విద్యాధికారి దేవి సింగ్ అందజేశారు. ఈ సందర్భంగా ఒప్పంద ఉద్యోగులు మాట్లాడుతూ.. గత 15 సంవత్సరాల నుంచి ఒప్పంద ఉద్యోగులుగా చాలీచాలని జీతాలతో విధులు నిర్వర్తిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న నిత్యవసర సరుకుల కుటుంబ భారముతో సతమతమవుతున్నా దృష్ట్యా ప్రభుత్వం వెంటనే స్పందించి రెగ్యులరైజ్ చేయాలని అప్పటివరకు మినిమం టైం స్కేల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఒప్పంద ఉద్యోగులు గోపాల్ ఠాకూర్, హైమద్ పాషా, కమల్ కిషోర్, అంబయ్య, అశోక్, రాఫీక్, కెజిబివి ఎస్వో సరితా, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షునిగా సర్దార్ నాయక్ ఎన్నిక

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండలంలోని పర్మల్ తండాకు చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు సర్దార్ నాయక్ ఎల్లారెడ్డి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా భారీ మెజార్టీతో గెలుపొందినట్టు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సర్దార్ నాయక్ మాట్లాడుతూ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో భారీ మెజార్టీతో గెలిపించిన ప్రతి యువతకి, ప్రతి ఓటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. యువత ఆశయాలు, ఆకాంక్షలు నెరవేర్చడమే ధ్యేయంగా పని చేస్తానని, అందరి సహకారంతో పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని అన్నారు.

నరసింహస్వామి విగ్రహ ప్రతిష్టాపన

వతెలంగాణ-జుక్కల్

మండలంలోని కౌలాస్ గ్రామంలో నరసింహస్వామి విగ్రహ ప్రతిష్టాపన అంగరంగ వైభవంగా జరిగిందని గ్రామ పెద్దలు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో విగ్రహాన్ని ఊరేగింపుగా గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో ఇప్పటివరకు నరసింహస్వామి విగ్రహం లేకపో వడంతో గ్రామస్తులు అంతా ఏకమై విగ్రహం చేయించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వరిగడ్డి వితరణ

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంకు చెందిన దుబాయ్ రాజు పశువులకు గాను 110 కట్టల వరి గడ్డిని గురువారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సద్గురు బస్వ లింగప్ప స్వామి గోశాల సంస్థాన మఠం బిచ్కుంద గోవులకు గాను వరిగడ్డి కట్టలను అందజేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మఠాధి శిష్యులు రమణ, తదితరులు, పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ విస్మరించి ఆరోపణలా..?

- **ఎమ్మెల్యే పై మండిపడ్డ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు**



మాట్లాడుతున్నన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు

నవతెలంగాణ-కామారెడ్డి

ఎవరి భూములైనా కబ్జాకు గురైతే వాటిని తిరిగి ఇప్పిస్తానని ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టి గెలిచిన కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఆ విషయాలను మరిచిపోయి మాట్లాడుతున్నా డని, ముందుగా నీకు దమ్ముంటే డిగ్రీ కళాశాల భూముల కబ్జా గురించి మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. గురువారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కామారెడ్డి ఎమ్మెల్యేకు పత్రికల్లో పేయిడ్ ఆర్టికల్ వేయించుకోవడం, టీవీ ఛానల్ కు ఇంటర్వ్యూలు ఇవ్వడం తప్ప ఆయనకు కామరెడ్డి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడం చేతకాదు అన్నారు. ముమ్మాటికి నువ్వు కామారెడ్డి ప్రజల నమ్మకాన్ని వమ్ము చేశావు అని, ప్రజా ఆగ్రహానికి నీ రూపురేఖలు మారకుండా చూసుకో వలసిన అవసరం వచ్చిందన్నారు. ఎన్నికల్లో చేసిన వాగ్దానాలు ఒకటి కూడా అమలు చేయలేదని, ఇంటి వద్ద న్యాయవాద బృందాన్ని ఏర్పాటు చేసి కబ్జాలకు గురైన భూములను ఇప్పిస్తానని ప్రగల్భాలు పలికావు మరి ఎంతమందికి న్యాయం చేశావని, దమ్ముంటే ముందు డిగ్రీ కాలేజ్ భూముల్లో జరిగిన కబ్జాల గురించి మాట్లాడాలన్నారు. గ్రామ గ్రామాన వాడ వాడ ఫిర్యాదుల పెట్టెను పెట్టావు ఎంతమంది ఫిర్యాదు చేశారు, ఎంతమందికి న్యాయం చేసావు, అభివృద్ధి జరుగుతుంటే సహించలేక ప్రోటోకాల్ జగడం మొదలుపెట్టావని విమర్శించారు. అనేక సంక్షేమ పథకాలు షబ్బీర్‌అలీ సహకారంతో నియోజకవర్గంలో అమలవుతున్నాయని కానీ ఎలాంటి అభివృద్ధి జరగడం లేదని ర్యాలీలు తీసి ఉన్న పరువు పోగొట్టుకుంటున్నట్టు విమర్శించారు. ముందుగా తాను చేసిన అభివృద్ధి చెప్పుకుంటూ సభలు ఏర్పాటు చేసి ర్యాలీలు నిర్వహిస్తే ప్రజలు హర్షిస్తారని, కానీ జరుగుతున్న అభివృద్ధిని విస్మరిస్తూ ర్యాలీలు చేపడితే ఉన్న పరువు పోతదని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షు పండ్ల రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోనె శ్రీనివాస్, కారంగుల అశోక్ రెడ్డి, ఐరేని సందీప్, తేజపు ప్రసాద్, బ్రహ్మానందరెడ్డి, రాజా గౌడ్, లక్కపతిని గంగాధర్, శ్యామ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండలంలోని సీతారాంపుర్, సంగమేశ్వర్ గ్రామాల్లో భారత రాజ్యాంగ ప్రచార ఉద్యమ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత బహుజన ఫ్రంట్ డీబీయాఫ్ రాష్ట్ర నాయకులు తలారి ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రాజ్యాంగ ఉత్సవాల్లో భాగంగా భారత రాజ్యాంగ ప్రచార ఉద్యమంలో జనవరి 26 వరకు ఆయా గ్రామాలలో నిర్వహిస్తామని, విద్యార్థులకు భారత రాజ్యాంగం పట్ల వ్యాస రచన పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క పౌరునికి ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సంగమేశ్వర్ తాజా మాజీ సర్పంచ్ సుమలత మురళి,గ్రామ అంబేద్కర్ సంఘం అధ్యక్షులు నత్తి రమేష్, గ్రామాల అంబేద్కర్ వాదులు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లు పరిశీలించిన ఎంపీడీవో



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని జలాల్పూర్, చిన్న ఆత్మకూర్, పెద్ద ఆత్మకూర్, మాటూర్ మాసన్ పల్లి గ్రామాలలో గురువారం ఎంపీడీవో ప్రభాకర్ చారి పోలింగ్ స్టేష న్లను పరిశీలించారు. స్థానిక సంస్థల ఎన్నికల దృశ్య పోలింగ్ స్టేషన్లను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ ఉన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు చిత్రపటాలకు గురువారం నాగిరెడ్డిపేట్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సన్నవడ్లకు బోనస్, రైతులకు రుణమాఫీ చేయడంతో పాలాభిషేకం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపేట్ కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు సాయ గౌడ్, నాయకులు మన్నె వెంకటి, బోయిని హనుమాన్లు, మన్నె యాదగిరి, మల్లేశం , భీమయ్య , గోపాల్ తదితరులు ఉన్నారు.

రైతు వేదికలలో ప్రపంచ నేలల దినోత్సవం



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని రైతు వేదికలలో గురువారం ప్రపంచ నేల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సదాశివనగర్ మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి నేలల సంరక్షణపై రైతులకు వివరించారు. ప్రతి రైతు భూసార పరీక్షలు చేసుకోవాలని అన్నారు. భూసార పరీక్షలు చేసుకుంటే నేల గురించి రైతులకు ఎ పంటలు వేసుకోవలి రైతులు వాడే ఎరువుల గురించి తెలుస్తుందని అన్నారు ప్రతి రైతు తప్పకుండా భూసార పరీక్షలు చేసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఏఈవోలు లక్ష్మీ కవిత రైతులు తదితరులు పాల్గొన్నారు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు సిద్ధమైన సమగ్ర శిక్ష ఉద్యోగులు

నవతెలంగాణ-తాడ్వాయి

తమ సమస్యలు పరిష్కరించి తమను రెగ్యులర్ చేయాలని కోరుతూ గురువారం నల్ల బ్యాడ్జీలతో కస్తూరిబా గాంధీ పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టు కొని తమను రెగ్యులర్ చేసి పే స్కేలు వర్తింపజేయాలని కోరారు. శుక్ర శనివారాల్లో జిల్లా కేంద్రాల్లో నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈనెల తొమ్మిదవ తేదీ నుండి నిరోధిక సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపల్ రాణి, మౌనిక, మంజుల, రాజేందర్, నర్సింలు బాలయ్య నాన్ టీచింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్యఆరోగ్య శాఖ మంత్రికి సన్మానం

నవతెలంగాణ-సదాశివనగర్

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదరం నరసింహ జన్మదినం పురస్కరించుకొని ఆయనను గురువారం మర్యాదపూర్వకంగా హైదరాబాద్‌లో కలిసి సన్మానించినట్లు కామారెడ్డి జిల్లా సేవాదళ్ అధ్యక్షులు బొంబోతుల లింగా గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్, రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

నవతెలంగాణ-మద్నూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటా కుటుంబ కుల గణన సర్వేపై జిల్లా కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మద్నూర్, డోంగ్లి, మండలాలకు చెందిన అధికారులు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. మండలాల్లో సర్వే జరిగిన తీరు, ఇతరాత్ర వివరాలు అధికారులు వెల్లడించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో కార్యక్రమాల్లో మద్నూర్ తహసీల్దార్ ఎండి ముజీబ్, ఎంపీడీవో రాణి, డోంగ్లి తహసీల్దార్ రేణుక చౌహాన్, మద్నూర్ ఉమ్మడి మండల పంచాయతీ అధికారి వెంకట నరసయ్య, ఉమ్మడి మండల ఉపాధి హామీ ప్రోగ్రాం అధికారి పద్మ, ఉమ్మడి మండల ఏపీఎం రవీందర్ పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకంతో మహిళల్లో ఆనందం

- **మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ**

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని ఆర్టీసీ నిర్వహించిన మహాలక్ష్మి పథకం, ప్రజా పాలన విజయోత్సవాల కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందు ప్రియా చంద్రశేఖర్ రెడ్డి హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసినటువంటి పథకాలు, దాంట్లో ముఖ్యమైన పథకం మహాలక్ష్మి పథకం అన్నారు. మహాలక్ష్మి పథకంతో రోజుకు 45.49 లక్షల నుంచి 58.13 లక్షలకు 27.80 శాతం పెరిగిన ప్రయాణికుల సంఖ్య మహిళలు, మేడారం జాతర 2024 లో వేల మందికి అమ్మవారి ప్రసాదం పార్సెల్ అందజేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో, డిపో మేనేజర్ ఇందిరా, డిప్యూటీ ఆర్ఎం శంకర్, కామారెడ్డి పట్టణ కౌన్సిలర్లు సుల్తానా సలీం,లడ్డు మొయినుద్దీన్, ఆర్టీసీ సిబ్బంది సమీర్, లింగం,కండక్టర్ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా ఒక్క పింఛన్, రేషన్ కార్డు ఇచ్చింది లేదు ఇంకా సంబరాలు ఎందుకు..?

నవతెలంగాణ-కామారెడ్డి

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా.. ఇప్పటి వరకు కొత్తగా ఒక్కరికి పెన్షన్, రేషన్ కార్డులు మంజూరు చేసింది లేదని ఇంకా సంబరాలు ఎందుకు చేసుకుంటున్నారని బీజేపీ నాయకులు ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కామారెడ్డి నియోజకవర్గ పరిధిలోని బీజేపీ కార్యకర్తలు ఏడాది రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ పట్టణంలోని పురవిధుల గుండా గురువారం బైక్ ర్యాలీ నిర్వహించారు. సి.ఎస్.ఐ గ్రౌండ్ నుండి ప్రారంభం అయిన బైక్ ర్యాలీ కొత్త బస్ స్టాండు, నిజాం సాగర్ చౌరస్తా, కమాన్, స్టేషన్ రోడ్, పొట్టి శ్రీరాములు విగ్రహం, జెపియన్ విగ్రహం, పాంచ్ చౌరస్తా, పెద్దబజార్, ల మీదుగా దేవునిపల్లి వరకు కొనసాగింది.

రెండవ వార్డులో ముళ్ళ పొదల తొలగింపు

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల అభ్యున్నతికి ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తూ సంవత్సర కాలంలో నిరుద్యోగులకు దాదాపు 50 వేల పైచిలుకు ఉద్యోగాలు కల్పించి, రైతులకు దాదాపు 25 వేల కోట్ల రూపాయలతో ఒక్కొక్కరికి దాదాపు రెండు లక్షల వరకు రుణ మాఫీతో చరిత్ర సృష్టించినారని ప్రముఖ న్యాయవాది, రెండవ వార్డ్ కౌన్సిలర్ కాందేశ్ సంగీత తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ డీఎస్సీ ద్వారా వేల టీచర్ ఉద్యోగాలు కల్పించి, మహిళామణులకు ఆర్టీసీ బస్సులలో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా నియోజకవర్గ ఇంచార్జ్ వినయ్ రెడ్డి ఆదేశానుసారం పట్టణంలోని రెండవ వార్డులో మున్సిపల్ బ్లేడ్ ట్రాక్టర్‌తో ముళ్ల పొదలను తొలగించి మున్సిపల్ సిబ్బంది వీధులను శుభ్రం చేశారని తెలిపారు. కార్యక్రమంలో సానిటరీ అధికారి గజానంద్, వార్డు ప్రత్యేక అధికారి సలీం, కాంగ్రెస్ నాయకులు ఖాందేష్ సత్యం, నరేశ్, మున్సిపల్ సిబ్బంది దొండి రమేష్, నర్సయ్య పోశన్న, తదితరులు పాల్గొన్నారు.

మేదరి కులానికి రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి

- జిల్లా మేదరి సంఘం
- బీసీ డెడికేషన్ కమిషన్ చైర్మన్ సెక్రటరీకి వినతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాకు వచ్చిన బిసి డెడికేషన్ కమిషన్ చైర్మన్, సెక్రెటరీని నిజామాబాద్ జిల్లా మేదరి సంఘం తరఫున గురువారం వినతి పత్రం అందజేశారు. మేదరి కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చుటకు కులానికి రాజకీయపరంగా అన్ని రకాలుగా రిజర్వేషన్ కల్పించాలని అన్నారు. కుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ప్రతి జిల్లాలో హరితహారం లో భాగంగా వెదురు మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా మేదరి సంఘం అధ్యక్షులు దర్శనం దేవేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సూరినీడ పోషాద్రి, ప్రచార కార్యదర్శి దర్శనం గంగాధర్, నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఊరె దశరథ్ పాల్గొన్నారు.

కూనేపల్లిలో నూతన డీలర్ షాప్ ప్రారంభం

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు



కూనేపల్లిలో రేషన్‌షాప్ ప్రారంభించిన మోబిన్‌ఖాన్

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కూనేపల్లి గ్రామంలో రేషన్ డీలర్‌గా నూతనంగా ఎంపికైన ఆర్.సంతోషిని షాప్‌ను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోబిన్ ఖాన్ గురువారం ప్రారంభించారు. ఇటీవల మండలంలోని ఖాళీలుగా ఉన్న రేషన్ దుకాణాలకు నూతన అభ్యర్థులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు జి సాయి రెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షులు సురేందర్ గౌడ్, జావీద్ ఉద్దీన్, ధనుంజయ్, సాయిబాబా గౌడ్ పాల్గొన్నారు.

మండలంలో బాగేపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోబీన్ ఖాన్ చౌక ధరల దుకాణాన్ని ప్రారంభించారు. గత కొన్ని సంవత్సరాలుగా ఇన్చార్జి డీలర్లతో కొనసాగుతున్న ఈ దుకాణానికి నవ్యత హరీష్ గౌడ్‌కు రావడంతో మొదటిసారి రేషన్ బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జి.సాయి రెడ్డి, జావీద్ ఉద్దీన్, సురేందర్ గౌడ్, ధనుంజయ్, నాయకులు పాల్గొన్నారు.

లంచం అడిగితే సమాచారం అందించాలి

- నిజామాబాద్ అవినీతి నిరోధక శాఖ డిఎస్పి శేఖర్‌గౌడ్
- అవినీతి నిరోధక శాఖలో అవగాహన ర్యాలీ



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి సిపి సింధు శర్మ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064కు సమాచారం అందించాలని నిజామాబాద్ అవినీతి నిరోధక శాఖ డిఎస్పి శేఖర్‌గౌడ్ అన్నారు. గురువారం నిర్వహించిన ర్యాలీని జిల్లా కేంద్రంలోని కోర్టు చౌరస్తా వద్ద ఇన్‌చార్జి సీపీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి సిపి సింధు శర్మ మాట్లాడుతూ.. ఫిర్యాదుదారులకు పోలీస్ స్టేషన్‌లలో సత్వర న్యాయం జరగకపోతే ఫిర్యాదు చేసేందుకు ఉమ్మడి జిల్లాలోని పోలీస్ స్టేషన్‌ల బయట బోర్డులపై ప్రత్యేక నంబర్ ఏర్పాటు చేయనున్నట్టు ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ తెలిపారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్న నంబర్‌కు వాట్సాప్ లేదా డయల్ చేసి ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. అవినీతిని నిర్మూలించేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ప్రైవేట్, ప్రభుత్వ రంగాలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్క రంగంలో అంతర్గత నిఘా అవసరమని సింధుశర్మ అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ కోటేశ్వరరావు, ట్రైనీ ఐపీఎస్ సాయికుమార్, ఏసిబిడిఎస్‌పి శేఖర్ గౌడ్, ఏసిపి నిజామాబాద్ రాజా వెంకటరెడ్డి, నిజామాబాద్ నగర పోలీసులు, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ డెమో ఇంటి నిర్మాణానికి భూమి పరిశీలన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామ పంచాయతీ వెనుక రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇందిరమ్మ డెమో గృహ నిర్మాణానికి గురువారం గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి దీప్‌చంద్ అధ్వర్యంలో స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే నిర్మాణం కానున్న ఇందిరమ్మ గృహాలకు మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లిలో డెమో నిర్మాణం చేపట్ట నున్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి తిరునగరి శ్రీధర్, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ధర్పల్లి ప్రభాకర్, కారోబార్ నరేందర్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



భూమిని పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి



మండల అధ్యక్షున్ని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

యువజన విభాగం మండల అధ్యక్షుడిగా తౌట్ అరవింద్

నవతెలంగాణ-బాల్కొండ

కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం బాల్కొండ మండల అధ్యక్షుడిగా తౌటు అరవింద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో అరవింద్ కు కండువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్వీట్లు పంచి, టపాకాయలు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ బాల్కొండ పట్టణ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇమ్రాన్ ఖాన్, యూనుస్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తౌటు అరవింద్‌కు సన్మానం..

కాంగ్రెస్ పార్టీ బాల్కొండ మండల యువజన అధ్యక్షులుగా ఎన్నికైన తౌటు అరవింద్ ను గురువారం వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ బాల్కొండ మండల అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఖ్యాతం కిషన్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ చిట్యాల శ్రీనివాస్, వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇమ్రాన్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రవీణ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం మండల సెక్రటరీ తేజ బిట్టు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆటోల బంద్.. పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు, ఆటోడ్రైవర్లు

నవతెలంగాణ-ఆర్మూర్

ఆటో, క్యాబ్, ట్యాక్స్ డ్రైవర్ల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ఈనెల 7న (రేపు) నిర్వహించే ఆటో, టాక్సి, వ్యాన్, క్యాబ్‌ల రాష్ట్ర వ్యాప్తంగా బందును జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆటో టాక్సీ క్యాబ్‌ల జేఏసీ పిలుపు నిచ్చిందని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు ఎం.ముత్తన్న అన్నారు. జిల్లాకేం ద్రంలోని కొత్త బస్టాండ్ ముందు ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా (టియుసిఐ), సిఐటియు ఆధ్వర్యంలో గురువారం ఆటో వర్కర్స్‌తో కలిసి పోస్టర్స్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటి యు మండల కన్వీనర్ కూతాడి ఎల్లయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో, టాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు ఇచ్చిన హామీల అమలుకు ఈనెల 7న నిర్వహించే రాష్ట్రవ్యాప్త బందును జయప్రదం చేయాలన్నారు. ఆటో, క్యాబ్, డ్రైవర్లకు సంవత్సరానికి 12000 ఇస్తానని, ఆటో మోటర్ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో చెప్పిన కాంగ్రెస్ పార్టీ అమలు చేయడంలేదన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించడం ద్వారా రాష్ట్రంలో ఉన్న ఆటో డ్రైవర్ల అందరికీ జీవనో ఉపాధికి పెద్ద దెబ్బ తగిలిందని, నష్టపోయిన డ్రైవర్లను ఆదుకుంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి, రవాణా శాఖ మంత్రులు చెప్పారని అన్నారు. కార్యక్రవ ంలో ట్రేడ్ యూనిట్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా నాయకులు జి.అరవింద్, మండల నాయకులు ఎండి నజీర్, టి.శీను, ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మహమ్మద్ అఖిల్, కార్యదర్శి, అమీన్, ఆటో డ్రైవర్స్ పఠాన్ మదర్ ఖాన్, ఎండి అమిన్ ఉద్దీన్, సయ్యద్ అజీత్, ఎండి మునీర్, ఎండి ఖలీల్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- మండల విద్యాధికారి ఆంధ్రయ్య

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

దివ్యాంగులు వివిధ రంగాల్లో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకొని భవిష్యత్తులో పైకి ఎదగాలని మండల విద్యాధికారి ఆంద్రయ్య అన్నారు. గురువారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పిఎంశ్రీ పాఠశాలగా ఎన్నికైన మండలంలోని చౌట్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో ఉన్న దివ్యాంగులకు ఆటల పోటీలు నిర్వహించి, వారి ప్రతిభను గుర్తించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఆంద్రయ్య మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులకు ఉన్న అవకాశాల గురించి వారి తల్లిదండ్రులకు వివరించారు. వివిధ ప్రత్యేక అవసరాలు గల పిల్లల ప్రతిభను వెలికి తీసి దిశానిర్దేశం చేయడం భవిత పాఠశాలలో జరుగుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులకు కల్పిస్తున్న వివిధ సౌకర్యాలను పిల్లలకు వారి తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం దివ్యాంగ ఉపాధ్యాయుడు గంగా కిషన్, ప్రత్యేక ఉపాధ్యాయులు విశ్వనాథ్, మధు శేఖర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కమల, పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు, సిఆర్పిలు, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణకు వచ్చిన ప్రొబెషనరీ ఐపియస్ సాయికిరణ్



నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ పోలీస్ అకాడమి నుండి నిజామాబాద్ జిల్లాకు ప్రొబెషనరీ నిమిత్తం వచ్చిన సాయికిరణ్ పత్తిపాక, ఐపియస్ ఈనెల 3న వచ్చినట్టు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయం నుండి గురువారం ప్రకటన విడుదల చేశారు. సాయికిరణ్, ఐపియస్-76 ఆర్ఆర్ (2023) బ్యాచ్, స్వస్థలం వరంగల్ జిల్లాకు చెందిన వారని తెలిపారు. బిఈ సివిల్ ఇంజనీర్ ఎంబిఏ చేశారని, 29 వారాల పాటు శిక్షణ నిమిత్తం వచ్చారని పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలయేవరకు ఉద్యమాలు కొనసాగిస్తాం

- ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ గారి భూమయ్య

నవతెలంగాణ-రెంజల్

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలయ్యేంతవరకు ఉద్యమాలను కొనసాగిస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ గారి భూమయ్య పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని మండల కో ఇంచార్జ్ కిన్నెర మోహన్ సమక్షంలో నూతన కమిటీని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే అమలు చేయాలన్నారు. లేకుంటే ఉద్యమం కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు.

రెంజల్ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎంపిక..

ఎమ్మార్పీఎస్ అధ్యక్షులుగా లక్ష్మీ గారి నరేష్, ప్రధాన కార్యదర్శిగా దగ్గుల రూపేష్, ఉపాధ్యక్షులుగా లక్ష్మీ గారి మహేష్, లక్ష్మీ గారి రవి ప్రసాద్, కార్యదర్శులుగా దగ్గుల ప్రకాష్, దగ్గుల బాబురావు, కోశాధికారిగా లక్ష్మీ గారి రవి, సహాయ కార్యదర్శిగా దగ్గుల అశోక్, సలహాదారుడిగా దగ్గుల నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా దగ్గుల ప్రభాకర్, నవీన్, రవితేజ, సతీష్, శంకర్, లక్ష్మణ్, భూమయ్య, శ్రీకాంత్ శ్యామ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణపై అవగాహన కల్పించాలి

- జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారం రాథోడ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రజా పాలన విజయోత్సవ సభలో భాగంగా శుక్రవారం డెంగ్యూ వ్యాధిపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ సూచించారు. గురువారం ఇందల్ వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలవారీ ఆశా కార్యకర్తల సమీక్ష సమావేశంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ తుకారం రాథోడ్ మాట్లాడుతూ.. ఎల్సిడిసి లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని ఉదయం 6 గంటల నుండి 9 గంటల లోపు పూర్తి చేయాలని అన్నారు. రాగి రంగు మచ్చలు, స్పర్శ లేని, చెమట రాని మచ్చలను గుర్తించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇందల్ వాయికి సమాచారం అందించాలని తెలిపారు. అనుమానిత కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించి వారి వివరాలను గోప్యంగా ఉంచాలని అన్నారు. ఇంటింటి సర్వే చేసేటప్పుడు ఎవరైనా జ్వరంతో బాధపడుతున్నట్లయితే వారిని గుర్తించి వారికి తగిన మలేరియా, డెంగ్యూ, రాపిడ్ పరీక్షలను నిర్వహించాలని తెలిపారు. గ్రామంలో నీటి నిల్వగల ప్రాంతాలను గుర్తించి గ్రామ కార్యదర్శికి నివేదిక ఇవ్వాలని ఆశా కార్యకర్తలకు ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎచ్‌పిలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్, ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ ఆలీ, దేవపాల, ఆరోగ్య కార్యకర్తలు వెంకట్ రెడ్డి, ఆనంద్ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్రాంతి తర్వాత ప్రతి రైతుకు రైతు భరోసా

- బాల్కొండ నియోజకవర్గ కోఆర్డినేటర్, శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి
- మండల కేంద్రంలో ప్రజా పాలన విజయవత్సవాలు



మాట్లాడుతున్న బాల్కొండ నియోజకవర్గ కోఆర్డినేటర్, శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఈనెల 9 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో రైతు భరోసాపై చర్చించి సంక్రాంతి తర్వాత ప్రతి రైతుకు రైతు భరోసా అందిస్తామని ప్రజా పాలన విజయోత్సవ బాల్కొండ నియోజకవర్గ కోఆర్డినేటర్, శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పద్మశాలి సంఘంలో ప్రజా పాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా రైతు, మహిళా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలో సాధించిన విజయాలను వారు వివరించారు. దేశంలోనే అతిపెద్ద రుణమాఫీ రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల లోపు రుణాలను మాఫీ చేశామని, మిగిలిన రుణాలను ప్రభుత్వం త్వరలోనే మాఫీ చేస్తుందన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో ఇప్పటికే మెజారిటీ రైతులకు రుణమాఫీ అయిందని మిగిలిన రైతులకు త్వరలోనే మాఫీ అవుతుందన్నారు. వరి పంటకు రూ.500 రూపాయల బోనస్ ఇవ్వడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం ద్వారా, వందల యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ ద్వారా, రూ.500 కి గ్యాస్ సిలిండర్ పథకం ద్వారా మహిళలకు వేల కోట్ల రూపాయలు ఆదా అవుతుందన్నారు. వారిద్దరికి మహిళలు పూలమాలతో ఘనంగా సన్మానించారు. అంతకుముందు మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సెర్ప్ ఏపీఎం కుంట గంగాధర్, పిసిసి అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకేట రవి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పడిగేల ప్రవీణ్, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్లపై పర్యవేక్షణ కరువు

- ఒక్కొక్క వార్డెన్‌కు ఇన్చార్జి బాధ్యతలు
- పాఠశాలకు వెళ్లకుండా హాస్టల్‌లోనే ఉన్న పలువురు విద్యార్థులు



నవతెలంగాణ-బోధన్

తమ పిల్లలు చదువుకుని ప్రయోజకులుగా మారుతారని భావించి హాస్టళ్లలో చేర్పిస్తే వారిని కనీసం పట్టించుకునే నాథుడే లేరని విమర్శలు వస్తున్నాయి. దీనికి నిదర్శనమే బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ లో గల ఎస్సీ(ఎ) హాస్టల్. ఈ హాస్టల్‌లో విద్యార్థులను పట్టించుకునే వారు లేరని తీవ్ర విమర్శలు వస్తున్నాయి. గురువారం మధ్యాహ్నం నవతెలంగాణ హాస్టల్ లో పరిశీలించగా కొంతమంది విద్యార్థులు పాఠశాలకు వెళ్లకుండా హాస్టల్‌లోనే ఉన్నారు. వారిని ప్రశ్నిస్తుండగా ఒకరిద్దరు మంచాల కింద దాక్కున్నారు. మరికొందరు గోడ దూకి బయటికి పారిపోయారు. అక్కడే ఉన్న ఓ విద్యార్థికి ప్రశ్నించగా జ్వరం వచ్చిందని, పుస్తకం కోసం వచ్చానని పొంతనలేని సమాధానం చెప్పాడు. హాస్టల్ ఆవరణలోనే ఉన్న ప్రాథమిక పాఠశాలలో చదివే విద్యార్థి కూడా స్కూలుకు వెళ్లకుండా హాస్టల్ లో ఉండిపోయారు. స్కూల్ కు ఎందుకు వెళ్లలేదని ప్రశ్నిస్తే ఏవేవో కారణాలు చెప్పాడు.మరో విద్యార్థి నీళ్లులేక స్నానం చేయలేదని అందుకే బడికి పోలేదని తెలిపాడు. అంటే విద్యార్థులకు కనీసం పట్టించుకునే వారు లేరని వెల్లడైంది. అలాగే రాత్రివేళ స్టడీ హవర్స్ లో చదువుకోకుండా కొంతమంది విద్యార్థులు దుర్వసనాలకు పాల్పడుతున్నారని సమాచారం. ఈ విషయమై హాస్టల్ వార్డెన్ విఠల్ ను వివరణ కోరగా విద్యార్థులు బడికి వెళ్లిన తర్వాత నేను శక్కర్ నగర్‌లోని ఇంచార్జిగా ఉన్న హాస్టల్ కు వచ్చానని తెలిపారు. హాస్టల్ లో నీటి ఇబ్బందులు ఉన్నాయని విద్యార్థులు అంటున్నారని అడడగా చిన్న రిపేర్ ఉందని తెలిపారు. తాను రెండు హాస్టళ్లను చూడవలసి వస్తుందని దాంతో పలు ఇబ్బందులు ఉన్నాయని వార్డెన్ విఠల్ తెలిపారు.

తాళ్ళరాంపూర్‌లో ప్రజాపాలన విజయోత్సవాలు

నవతెలంగాణ-ఏర్గట్ల

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి సంవత్సరం అయిన సందర్భంగా మండలంలోని తాళ్ళరాంపూర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహించారు. ఇందులో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సోమ దేవరెడ్డి, బాల్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆదేం గంగప్రసాద్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీపై ప్రతిపక్షాలు అబద్ధపు ప్రచారాలను మానుకోవాలని, పార్టీ రైతులకు, పేదలకు, బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోటగిరి రామగౌడ్, తుమ్మల ప్రభాకర్, బెజ్జారం భాను, దిబ్బ శ్రీనివాస్, నూకల అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సాహెబ్ పేట గ్రామ అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు దుస్తుల పంపిణీ



చిన్నారులకు దుస్తులు అందజేత

నవ తెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

మండలంలోని సాహెబ్ పేట్ గ్రామంలో అంగన్వాడీలో గురువారం దుస్తువుల పంపిణీ చేశారు. మండలంలో 49సెంటర్లకు 3 నుండి 5సంవత్సరాలు గలవారికి 906 జతల దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమం లో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రంగు అనిల్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు నవీన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డ్యూయల్ డెస్క్ బెంచ్‌ల వితరణ

నవతెలంగాణ-మోర్తాడ్

మండల కేంద్రంలోని గర్ల్స్ బాలికల పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం 15 డ్యూయల్ డెస్క్ బెంచ్‌లను వితరణ చేసినట్లు ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ తెలిపారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త ఏనుగు దయానంద రెడ్డి పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం వితరణ చేసినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో స్థిరపడ్డ పారిశ్రామికవేత్త వసంత టూల్స్ అండ్ క్రాఫ్ట్ మేనేజింగ్ డైరెక్టర్ విద్యార్థుల సౌకర్యం 15 డ్యూయల్ డెస్క్ బెంచ్‌లను అందజేసినట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యామ్, రాజ ,రవి రాజ్, రవీందర్, పద్మ అనిత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్

నవతెలంగాణ-బాల్కొండ

అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ విజయ్ భాస్కర్ గురువారం మండల పరిధిలోని పలు పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్ష పరీక్షా కేంద్రాలను పునర్వ్యవస్థీకృతం చేయడానికి కిసాన్ నగర్‌లో ఉన్న మౌలిక సదుపాయాల విషయంలో ఆరా తీశారు. పునర్వ్యవస్థీకరణ విషయంలో సమగ్ర నివేదికను సమర్పించాలని మండల విద్యాధికారి బట్టు రాజేశ్వర్‌ను ఆదేశించారు. అలాగే వారితో పాటు ప్లానింగ్ కోఆర్డినేటర్ సమగ్ర శిక్ష ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు కూడా సెయింట్ ఈఏఎస్ పాఠశాల, భవిత సెంటర్‌ను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు అందిస్తున్న ఉచిత దుస్తుల విషయంలో అక్విటెన్స్‌ని పరిశీలించారు. మండల పాఠశాలలో అమలవుతున్న సమగ్ర శిక్ష విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు.

చోరీ కేసులో నిందితునికి సంవత్సరం జైలుశిక్ష, నగలు రికవరీ

నవతెలంగాణ-బోధన్

రుద్రూర్ గ్రామంలో 2017లో మోత్యాారి శశికళ అనే మహిళ ఇంట్లో జరిగిన చోరీ ఘటనలో మూడు తులాల బంగారం, 10 తులాల వెండి ఆభరణాలు, వెయ్యి రూపాయల నగదు చోరీకి గురయ్యాయి. ఈ ఘటనలో రుద్రూర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల విచారణలో బోధన్‌కు చెందిన ఎరుకల్వార్ అశోక్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో చార్జీలను దాఖలు చేశారు. అనంతరం దర్యాప్తులో భాగంగా ఆయన వద్ద నుంచి దొంగిలించిన వస్తువులను పోలీసులు రికవరీ చేశారు. ఈ కేసును విచారించిన అదనపు న్యాయమూర్తి ఈ.సాయి శివ, నిందితుడు ఎరుకల్వార్ అశోక్‌కి ఒక సంవత్సరం జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసులో బాధితుల తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాణి వాదనలు వినిపించగా, రుద్రూర్ ఎస్ఐ సాయన్న, కోర్టు కానిస్టేబుల్ గణపతి సాక్షులను ప్రవేశపెట్టారు.

విద్యార్థులకు లోటు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

- తెలంగాణ విద్యా కమిషన్ సభ్యురాలు కందాడి జ్యోత్స్నా, శివ రెడ్డి
- కేజీబీవీ, గిరిజన సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల సందర్శన


విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు పరిశుభ్రతను పాటించాలని, విద్యార్థులకు ఎలాంటి లోటు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని , కేజీబీవీ బాలికల విద్యాలయం, గిరిజన విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని తెలంగాణ విద్యా కమిషన్ సభ్యురాలు కందాడి జ్యోత్స్నా, శివరెడ్డి సూచించారు. గురువారం ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామ శివారులోని కెజిబివి బాలికల విద్యాలయం, తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని, వంట శాలను, బియ్యాన్ని, పప్పులను, కూరగాయలను, వంట సామాగ్రి నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. డిసెంబర్ 7 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ విద్యా సంస్థల్లో పర్యటించి.. అక్కడి పరిస్థితులను విద్యా కమిషన్ సభ్యులు పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కమిషన్ పర్యటనకు సహకరించడంతో పాటు.. అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎస్ శాంతికుమారి, జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంతోపాటు పరిశుభ్రతను పాటించాలని, విద్యార్థులకు ఎలాంటి లోటు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రిన్సిపాల్‌కు సూచించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా ? లేదా ఆహార నాణ్యతపై విద్యార్థులను నేరుగా అడిగి ఇబ్బందులు సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కెజిబివి బాలికల విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ వర్షా, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైకల్యాన్ని జయిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చు

నవతెలంగాణ-ఆర్మూర్

మనో ధైర్యంతో తమలోని వైకల్యాన్ని జయిస్తే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని మండల విద్యాధికారి రాజ గంగారాం సూచించారు. పట్టణంలోని భవిత కేంద్రంలో సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగులు తమలోని వైకల్యాన్ని బలహీనతగా భావించకుండా.. బలంగా భావించి పట్టుదలతో చదువులు పూర్తి చేయాలన్నారు. తల్లిదండ్రులు సైతం వారిని నిరుత్సాహపరచకుండా ప్రోత్సహించాలన్నారు. భవిత కేంద్రంలో ప్రతీ గురువారం నిర్వహించే ఉచిత ఫిజియోథెరపీ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం క్రీడా పోటీల్లో విజేతలతో పాటు భవిత కేంద్రానికి వచ్చే దివ్యాంగులకు బహుమతులు అందజేశారు. ఫిజియోథెరపీ వైద్యురాలు అరుణ దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ఐఈఆర్పీ కిషన్ , సురేష్, ఏంఐఎస్ కోర్డినేటర్ అలేఖ్య, ఆపరేటర్ రఘు, మెసెంజర్ రవి, సీజీవీ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షల నిర్వహణ


కంటిపరీక్షలు చేస్తున్న వైద్యులు

నవతెలంగాణ-బాల్కొండ

లయన్స్ క్లబ్ ఆఫ్ బాల్కొండ ఫోర్ట్ వారి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మమతా బావయ్య కాంప్లెక్స్ లో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 71 మందికి వైద్యురాలు ప్రవల్లిక కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్య క్షులు అందే వెంకటగిరి, సెక్రటరీ ద్యావతి పోశెట్టి, ట్రెసరర్ కటికె శ్రీనివాస్, చాకు లింగం పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ వాలంటీర్ డే



నవతెలంగాణ-ఆర్మూర్

లయన్స్ క్లబ్ ఆఫ్ నవనాథపురం ఆధ్వర్యంలో "ఇంటర్నేషనల్ వాలంటీర్ డే" సందర్భంగా రోగులకు స్వచ్ఛందంగా రక్తదానం చేస్తున్న హెల్పింగ్ హాండ్స్, పేదవారి ఆకలి తీరుస్తున్న త్రినేత్ర ఫౌండేషన్, సేవ్ లైఫ్ ప్రతినిధులను గురువారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చెరుకు పృథ్వీరాజ్, సీనియర్ సభ్యులు రఫీ గోయన్ విజయానంద్, శ్రీధర్ చంద్రశేఖర్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఉత్తమ వాలంటీర్‌గా హెల్పింగ్ హాండ్స్ బ్లడ్ డోనర్స్ ఫౌండర్ కలిగోట ప్రశాంత్ లయన్స్ క్లబ్ ఆఫ్ అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వాలంటీర్ దినోత్సవం పురస్కరించుకుని హెల్పింగ్ హాండ్స్ బ్లడ్ డోనర్స్ ఫౌండేషన్ ద్వారా ఆపదలో ఉన్నవారికి సరైన సమయంలో రక్తాన్ని అందిస్తున్న వారిని గుర్తించి మెమొంటో శాలువాతో సన్మానించారు. సేవలను విస్తృతం చేస్తూ ప్రజల్లో సమాజంలో, యువతలో చైతన్యం తేవాలని వారు కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మెంబర్స్ రఫిక్, గుర్రం విజయనంద్, పోల మధుకర్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఏర్గట్ల విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ-ఏర్గట్ల

మహిళల ఇంటర్ డిస్ట్రిక్ట్ కబడ్డీ ఛాంపియన్ షిప్, రాష్ట్రస్థాయి పోటీలకు, ఏర్గట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న నిఖిత ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జ్యోతి తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుండి 10 తేదీ వరకు హైదరాబాద్‌లో పోటీలు జరుగుతాయని అన్నారు.ఎంపికైన విద్యార్థినిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణాచారి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని సన్మానించిన నియోజకవర్గ యువజన నాయకులు



నవతెలంగాణ-రెంజల్

మండలంలో బోర్గం గ్రామానికి చెందిన కార్తిక యాదవ్ బోధన్ నియోజకవర్గం యువజన నాయకులుగా, మండల కేంద్రమైన రెంజల్ గ్రామానికి చెందిన గైని కిరణ్ మండల అధ్యక్షుడిగా ఎంపిక కావడంతో వారు గురువారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసానికి మాజీమంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని కలిశారు. శాలువా కప్పి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ యువతను జాగృత పరుస్తూ పార్టీని బలోపేతం చేయడానికి తమ వంతు కృషి చేయాలని వారిని ఆదేశించినట్లు వారి పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించే దిశలో ముందుకు సాగాలని పిలుపునిచ్చినట్లు వారు తెలిపారు. వారి వెంట బోధన్ మండలం యువజన అధ్యక్షులు యజ్ఞేశ్ ఉన్నారు.

యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నాగుల రాజు గౌడ్



నవతెలంగాణ-ఎడపల్లి

యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో భాగంగా ఎడపల్లి మండలం జైతాపూర్ గ్రామానికి చెందిన నాగుల రాజు గౌడ్ జిల్లాలోనే భారీ మెజారిటీతో జిల్లా ప్రధాన కార్యదర్శి గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాజు గౌడ్ మాట్లాడుతూ.. తనవిజయానికి సహకరించిన మిత్రులకు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్, ఎడపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పులి శ్రీనివాస్, నిజామాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బిల్ల రామ్మోహన్, జైతాపూర్ సహకార సంఘం అధ్యక్షులు, బోధన్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కరూటూరి సత్యనారాయణ, బొబ్బిలి శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండల కాంగ్రెస్ పార్టీ, యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రెండు జెసిబీలు, రెండు టిప్పర్లు పట్టివేత

నవతెలంగాణ-కోటగిరి

మండలంలోని ఎత్తొండ గ్రామంలో బుధవారం రాత్రి అక్రమంగా ఎర్రమట్టి తరలిస్తున్న రెండు జెసిబి, రెండు టిప్పర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. సంబంధిత అధికారులకు తెలిపినట్టు పేర్కొన్నారు. అక్రమంగా ఎర్రమట్టి, ఇసుక తరలించే వారిపై చట్టరిత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బ్రాహ్మణపల్లిలో ఘనంగా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన

గ్రామంలో ఐదు రోజుల పండుగ

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని రామనపల్లి గ్రామంలో ఘనంగా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్టాపన ఐదు రోజులు పండుగ నిర్వహించారుజ ఐదు రోజుల పాటు గ్రామంలో పండగ వాతావరణం ఏర్పడింది. ఇందులో గౌడ్లు అందరూ పాల్గొని విజవంతం చేసారు. గౌండ్ల పెద్ద మనిషి చింతల రంజిత్ గౌడ్ ఆధ్వర్యంలో గాజర్ల రవి గౌడ్, ముసలాపురం గంగామోహన్ గౌడ్, చింతల దశగౌడ్ పాల్గొన్నారు.

నేల ఆరోగ్యాన్ని కాపాడాలి

- ఏవో రాంబాబు

నవతెలంగాణ-ఆర్మూర్

పంటల దిగుబడి సారవంతమైన నేల ఆరోగ్యాన్ని బట్టి ఉంటుందని ఆధారపడుతుందని ఏవో రాంబాబు అన్నారు. ఆలూర్ మండల కేంద్రంలో ప్రపంచ మృత్తిక దినోత్సవం సందర్భంగా గురువారం రైతులకు నేల సంరక్షణ, భూసార పరిరక్షణ, జీవన ఎరువుల వాడకం, సేంద్రీయ కర్బన పదార్థల పెంపు, మట్టి నమూనా సేకరణ, మృతిక పరీక్షా ఫలితాల ఆధారంగా ఎరువుల వాడకంపై ఆలూర్ మండల వ్యవసాయ అధికారి రాంబాబు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..రైతుల ఆదాయం పెరగాలంటే తప్పనిసరిగా పంటలు దిగుబడి పెరగాలని, కానీ ప్రస్తుతం రైతులు పంటల దిగుబడి పెంచే క్రమంలో మోతాదుకు మించి ఎరువుల వాడకం వల్ల భూమి కాలుష్యంతో భూమిలోని పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు, వానపాముల సంతతి క్రమంగా క్షీణిస్తుందని తెలిపారు. నేలలో సేంద్రియ కర్బన పదార్థం తగ్గడం వల్ల పంటల దిగుబడి క్రమక్రమంగా తగ్గుతుందని, మోతాదు మించి ఎరువులు వాడడం వల్ల భూమిలో లవణ సాంద్రత, చౌడు పెరిగి దీర్ఘకాలంలో పంటల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. పచ్చిరొట్ట పంటల పెంపకం, మట్టి నమూనా పరీక్ష చేయించుకోవడం, వాటి ఫలితాలు ఆధారంగా మోతాదులో ఎరువులు వాడుకోవడం రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా జీవన ఎరువులను వాడటం వంటి దీర్ఘకాలిక సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటించినప్పుడే పంటలు దిగుబడి పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏ ఈ ఓ వసుధం, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ముక్కెర విజయ్, రైతులు పాల్గొన్నారు.

భూమిపరిరక్షణ పద్ధతులు పాటించాలి

- ఏవో జోత్స్న


మాట్లాడుతున్న నందిపేట్ ఏవో జ్యోత్స్న

నవతెలంగాణ-(నందిపేట్)నిజామాబాద్

ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా రైతువేదిక నందిపేట్‌లో అన్ని రైతువేదికల్లో రైతులకు భూమి పరిరక్షణ, సుస్థిర వ్యవసాయ పద్ధతుల గురించి ఏవో జోత్స్న వివరించారు. మట్టిలో పోషక లభ్యతను మెరుగు పరిచే విధానాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. మట్టి నమూనాలు తమ పొలాల్లో ఎలా తీయాలనే విధానం వివరించారు. బయోఫర్టిలైజర్స్ వాడడం వల్ల కలిగే లాభాల గురించి వివరించారు.

చలికాలంలో పిల్లల పట్ల జాగ్రత్తలు పాటించాలి

- నిర్లక్ష్యం వహిస్తే వ్యాధులతో రిస్క్
- డాక్టర్ ఎం.గురుస్వామి, శివ శంకర్ చిన్నపిల్లల వైద్య నిపుణులు



నవతెలంగాణ-భీంగల్‌రూరల్

చల్లటి వాతావరణం ఉండే శీతాకాలంలో ఇన్‌ఫెక్షన్లు, సీజనల్ వ్యాధుల ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. పిల్లలపై వీటి ప్రభావం ఎక్కువగా పడే అవకాశం అధికమని, ఈ కాలంలో చిన్నారులకు జలుబు, దగ్గు, జ్వరం లాంటివి వచ్చే రిస్క్ ఎక్కువగా ఉంటుందని భీంగల్ మండల కేంద్రానికి చెందిన "గౌరీ శంకర్ పిల్లల హాస్పిటల్ యాజమాన్యం డాక్టర్ ఎం.గురుస్వామి, శివ శంకర్ (చిన్నపిల్లల వైద్య నిపుణులు) తెలిపారు. పిల్లలు ఎలాంటి వ్యాధుల బారిన పడకుండా చలికాలంలో పెద్దలు వారి పట్ల జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని. ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం వహించకూడదని అన్నారు. పిల్లల పట్ల తీసుకోవాల్సిన ముఖ్యమైన జాగ్రత్తలు తెలిపారు. సరిపడా నీరు తాగేలా చూడాలని, వెచ్చగా ఉండేలా డ్రెస్సింగ్ చేయాలని, గోరువెచ్చని నీరు తాగించాలని అన్నారు. కాసేపు పొద్దున ఎండను ఆస్వాదించేలా చూడాలని, మంచి ఆరోగ్యమైన ఆహారాన్ని పిల్లలకు అందించాలని తెలిపారు. పిల్లల పట్ల జాగ్రత్తలు పాటించకపోతే పిల్లలకు ఇన్‌ఫ్లుయాంజ అనే వైరస్ వల్ల పిల్లలు అనారోగ్యం పాలవుతారని, అందుకే వారి తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలని అన్నారు.

సిఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-మెండోర

ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం బుస్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బుస్సాపూర్ గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూత్‌పల్లి శ్రీనివాస్, కాటిపల్లి రాజేశ్వర్, నోముల గంగారెడ్డి, సామ సాయరెడ్డి, నోముల శ్రీనివాస్, మహిళా సంఘాల ప్రతినిధులు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం

ఎంఏ షాహిద్ బిఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు



నవతెలంగాణ-బాల్కొండ

2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు పిసిసి అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి ఇచ్చిన ఆరుహామీలు ప్రభుత్వం ఏర్పడ్డాక వంద రోజులలో అమలు చేస్తామని ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై సంవత్సరం గడుస్తున్నా అమలు చేయడంలో విఫలం అయ్యిందని బీఆర్ఎస్ పార్టీ బాల్కొండ మండల ఉపాధ్యక్షుడు ఎంఏ షాహిద్ విమర్శించారు. ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా షాహిద్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలు ఆరు గ్యారంటీలను నమ్మి ఓట్లు వేశారని, ఆ నమ్మకాన్ని ఈ ప్రభుత్వం వమ్ము చేసిందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేకుంటే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలతో రైతులతో కలిసి హామీలపై కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ ప్రతిపక్ష నాయకులను అక్రమ అరెస్టులు చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం తీరు మార్చుకోవాలని సూచించారు. హామీలు అమలు అయ్యేవరకు ప్రజల తరపున పోరాడుతామని ఈ సందర్భంగా హెచ్చరించారు.

ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలి

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ బలోపేతం చేయాలని పీఓడబ్ల్యూ, పీవైఎల్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బోధన్ జిల్లా ఆసుపత్రిని నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గోదావరి మాట్లాడుతూ ఆసుపత్రిలో ఎన్నో సమస్యలు వెలుగుచూశాయని అన్నారు. తక్షణమే ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని, వైద్య పరీక్షలకు ఉపయోగించే పరికరాలను అందుబాటులో తేవాలని, ప్రయివేటు ఆసుపత్రుల్లో ఫీజుల దోపిడీని నియంత్రించాలని, నాణ్యమైన మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిఓడబ్ల్యు జిల్లా ఉపాధ్యక్షురాలు బి నాగమణి, జిల్లా నాయకురాలు నర్సక్క, బీపాషా బేగం, పి వై ఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఇందిరమ్మ ఇండ్లకు కేటాయించాలి

- తహసీల్దార్‌కు వినతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

సర్వే నెంబర్ 349లోగల 7.24 గుంటల ప్రభుత్వ భూమిని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లకు కేటాయించాలని డిచ్ పల్లి తహసీల్దార్ ప్రభాకర్‌కు సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజా పంథా) పార్టీ ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజా పంథా) పార్టీ మండల కార్యదర్శి మురళి మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిని కేటాయించి ఘన్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఇస్లాంపూర్, గన్‌పూర్ ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వస్తే నిరుపేదలకు పక్కా ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తామని, సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. నూతన రేషన్ కార్డులు ఇవ్వాలని, ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. లేకుంటే గత ప్రభుత్వాలకు పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి సాయ గౌడ్, డివిజన్ నాయకులు మోహన్, కిషన్, భాగ్య, శారద, వడ్డెవ్వ, సుజాత, జమున, లక్ష్మి, గంగమణి, తదితరులు పాల్గొన్నారు.

వస్త్రదానం, అన్నదానం చేయడం అభినందనీయం


వస్త్రాలు దానం చేస్తున్న మండల ఆదినారాయణ

నవతెలంగాణ-కోటగిరి

మండలంలోని ఎత్తొండ ఉన్నత పాఠశాలలో పేదలకు గ్రామానికి చెందిన మండవ ఆదినారాయణ రావు తల్లిదండ్రులు వరమ్మ, ఆంజనేయులు, భార్య రమాదేవి జ్ఞాపకార్థం అన్నదానం, వస్త్ర దానం గురువారం నిర్వహించారు. 25 సంవత్సరాల నుండి పేదవారికి వస్త్రదానం చేయడం గర్వించదగ్గ విషయమని మండల విద్యాధికారి శ్రీనివాసరావు తెలుపుతూ లక్ష్మీపుత్రుడుగా పేర్కొన్నారు. ఆర్ 24 తెలుగు ఛానల్ ఎండి మండవ రమాదేవి మాట్లాడుతూ 90 సంవత్సరాల వయసులో అన్నదానం, వస్త్ర దానం చేయడం శుభపరిణామం అని, ఆదర్శవంతమైన జీవనం మండవ ఆదినారాయణరావుకు చెందుతుందన్నారు, అనంతరం 1994 పూర్వ విద్యార్థి ఉన్నత చదువులు చదువుతున్న పేద విద్యార్థులకు 50 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామంలో సహాయ కార్యక్రమాలు చేపట్టడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు అలివేలు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాపారావు, ఉపాధ్యాయులు అజయ్, సాయిలు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు